మీ గళం..మా కళం...

# నమస్తే హైదరాబాద్

NAMASTHE HYDERABAD

తెలుగు దిన పత్రిక

RNI No: APTEL/2012/45237

| రంగారెడ్డి | మంగళవారం | 16-12-2025 | సంపుటి : 14 | సంచిక :190 | పేజీలు :8 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|
| RangaReddy | Tuesday | 16-12-2025 | Volume :14 | Issue:190 | Pages:8 | Cost : 3 |



విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను.

సీనియర్‌లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం
Ph: 9912580066


## ఉపాధి హామీ పథకం అమలుపై..
## మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు..



**హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే హైదరాబాద్) :** తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రం కుట్ర చేస్తోందని ఆమె ఆరోపించారు. కేవలం పథకం పేరునే కాకుండా.. దాని అమలు విధానాన్ని మార్చేలా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. పేదలకు ఉపాధి భరోసా కల్పించాలన్న మహాత్మా గాంధీ ఆలోచనలకు ఇది పూర్తిగా విరుద్ధమని మంత్రి స్పష్టం చేశారు.

ఉపాధి హామీ పథకం పేరును 'వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్' గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లును మంత్రి సీతక్క తీవ్రంగా తప్పుబట్టారు. పథకం పేరు నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా.. గాంధీజీ ఆలోచనలు, విలువల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని ఆమె ఆరోపించారు. మొదటి నుంచే ఈ పథకం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఇష్టం లేదని.. అందుకే దశలవారీగా బలహీనపరిచే కుట్రలకు

2లో

## తెలంగాణ మంత్రి వర్గంలో మార్పులు
# కొత్త వారికి అవకాశం



- తెలంగాణ కేబినెట్‌లో మార్పులు
- మంత్రులుగా కొత్తవారికి ఛాన్స్
- పీసీసీ మహేష్ కుమార్ గౌడ్ కీలక కామెంట్స్

**హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే హైదరాబాద్) :** తెలంగాణ క్యాబినెట్ ప్రక్షాళనపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రివర్గం ప్రక్షాళన కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, అయితే ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని ఆయన స్పష్టం చేశారు. తనకు మాత్రం మంత్రివర్గంలోకి వెళ్లే ఉద్దేశం ఏ మాత్రం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రికి కూడా ఉండని ప్రాధాన్యం పీసీసీ అధ్యక్షునికి ఉంటుందని చెప్పారు. ఈ కారణంగానే.. పార్టీ అధ్యక్షుడిగానే కొనసాగడానికి తాను ఇష్టపడుతున్నట్లు వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే.. తాము పార్టీ కోసం పనిచేయాలని భావిస్తుండగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గారు మాత్రం మంత్రివర్గంలో చేరితే బాగుంటుందని అడిగారని తెలిపారు. అయితే, తాను మాత్రం పార్టీ కోసం పనిచేయడమే ఇష్టమని చెప్పినట్లు వివరించారు. ఆదివారం రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ నిర్వహించిన 'ఓట్ చోర్... గద్దీ ఛోడ్' ఆందోళనలో పాల్గొనడానికి వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై మహేశ్‌కుమార్‌గౌడ్ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి మంచి విజన్ ఉందని.. రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన పట్టుదలతో పనిచేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో హైదరాబాద్‌తో ఎవ్వరూ పోటీపడలేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం నగరాన్ని అభివృద్ధి చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు న్యాయం చేస్తోందని, డీసీసీ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం ఇందుకు నిదర్శనమని గౌడ్ స్పష్టం చేశారు. అంతేకాకుండా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న వివిధ పదవుల భర్తీని నెలరోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌ల విషయంలో రేగిన వివాదాలు సద్దుమణిగాయని, ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం కూడా సంతృప్తిగానే ఉందని ఆయన వివరించారు.కాగా, తెలంగాణ మంత్రివర్గంలో ప్రస్తుతం రెండు ఖాళీలు ఉన్నాయి. తొలిసారి విస్తరణలో వివేక్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ పదవులు దక్కించుకున్నారు. ఆ తర్వాత జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో అజారుద్దీన్‌కు సైతం మంత్రి పదవి ఇచ్చారు. ప్రస్తుతం రెండు పదవులు ఖాళీగా ఉండగా.. పలువురు సీనియర్లు పోటీ పడుతున్నారు. వారిలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలు ముందు వరుసలో ఉన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో కొందరిని తప్పించి కొత్త వారికి అవకాశం ఇచ్చే దిశగా కాంగ్రెస్ అదిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

## ఖాకీ వదిలి ఖద్దరులోకి..



**హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే హైదరాబాద్) :** ప్రస్తుతం రాజకీయాల్లోకి ప్రవేశించడం ఒక ఫ్యాషన్‌గా మారింది. ప్రజాసేవ చేయగలిగే అనేక అవకాశాలు ఉన్నప్పటికీ, ప్రజా ప్రతినిధిగా ఎన్నిక కావాలనే ఉబలాటం చాలా మందిలో కనిపిస్తుంది. తమకు ఉన్నతమైన ఉద్యోగాలను సైతం వదులు కొని రాజకీయాల్లోకి వస్తుంటారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారం చేపట్టి తమ గ్రామాలకు లేదా పట్టణాలకు సేవ చేయాలనే తపనతో చాలామంది అధికారులు, ఉద్యోగులు స్వచ్ఛంద పదవీ విరమణలు తీసుకుని రాజకీయ రంగంలోకి అడుగుపెడు తున్నారు. అయితే, ప్రజల అంచనాలు, వారి నిర్ణయాలు ఊహించిన దానికంటే భిన్నంగా ఉండవచ్చని ఈ మధ్య జరిగిన ఒక సంఘటన నిరూపించింది. సూర్యాపేట జిల్లా, కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేసిన పులి వెంకటేశ్వర్లు కూడా ఇదే కోవలోకి వస్తారు. కానిస్టేబుల్‌గా తన వృత్తిని ప్రారంభించి,

2లో

## సీతారామపురంలో ఉద్రిక్తత..
### ఎన్నికల అధికారిని గదిలో బంధించిన గ్రామస్థులు

**డిసెంబర్ 15 (నమస్తే హైదరాబాద్) :** ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల హడవుడి నడుస్తుంది. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం.. సీతారామపురం గ్రామంలో ఎన్నికల అధికారి నాగరాజు ను గ్రామస్థులు ఓ గదిలో బంధించారు. ఎన్నికల అధికారి ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని.. ఉపసర్పంచ్ పదవిని ముందుగానే ప్రకటించారని గ్రామస్థులు ఆరోపిస్తున్నా రు. నాగరాజు వ్యవహారంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన్ని గదిలో బంధించారు. దీంతో గ్రామంలో తీవ్ర ఉ




ద్రిక్తతచోటు చేసుకుంది. ఈ ఘటనపై అధికారులు, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే విషయం తెలియాల్సి ఉంది

ఇదిలా ఉంటే ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు సంబరాలు చేసుకుంటే.. ఓడిన అభ్యర్థులు

2లో

## ఢిల్లీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పొగమంచు



**డిసెంబర్ 15 (నమస్తే హైదరాబాద్) :** రాజధాని ఢిల్లీని ఈరోజు ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసింది. వాయు కాలుష్యం 'తీవ్ర' స్థాయికి చేరడంతో నగరం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. గాలి నాణ్యత సూచీ ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో దృశ్యమానత తగ్గింది. ఫలితంగా విమాన, రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రకారం, ఇవాళ ఉదయం 6 గంటలకు ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ 456గా నమోదైంది. ఇది ఈ సీజన్‌లోనే రెండో అత్యంత గరిష్ఠ స్థాయి. ఆదివారం ఏక్యూఐ 461 గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అక్షర్‌ధామ్ వద్ద ఏక్యూఐ 493గా, బారాఖంబా రోడ్డులో 474గా నమోదైంది. కాలుష్యం కారణంగా ఏర్పడిన పొగమంచు తో ఢిల్లీ విమానాశ్రయంలో సుమారు 100 విమానాలు రద్దు కాగా, 300కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు 90కి పైగా రైళ్లు 6 నుంచి 7 గంటల పాటు ఆలస్యంగా నడుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్, ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి సంస్థలు ప్రయాణికులకు ప్రత్యేక సూచనలు జారీ చేశాయి. ప్రయాణానికి ముందు తమ విమాన సర్వీసుల వివరాలు తెలుసుకోవాలని కోరాయి.

## నేను ఇప్పుడు తెలంగాణ వాన్ని..



**హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే హైదరాబాద్) :**తెలుగు సంగీత ప్రపంచానికి చిరస్మరణీయుడైన గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్ రవీంద్ర భారతి ప్రాంగణంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రాష్ట్ర మంత్రి డి. శ్రీధర్ బాబు, ప్రముఖ సినీ కళాకారులు హాజరై కార్యక్రమాన్ని మరింత విశిష్టంగా నిలిపారు. విగ్రహావిష్కరణ అనంతరం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కు నెల్లూరు తో ఉన్న అనుబంధం చెప్పే క్రమంలో "నేను అప్పుడు నెల్లూరు వాణ్ని, ఇప్పుడు తెలంగాణ వాణ్ని. ఇక్కడ ఉంటున్నాను కాబట్టి తెలంగాణ వాణ్నే. ఇకపై ఇక్కడే ఉంటాను కూడా" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. భాష, సంస్కృతి గురించి మాట్లాడిన వెంకయ్య నాయుడు, బ్రిటిష్ పాలనలో ఇంగ్లీష్ మనపై రుద్దబడిందని చెప్పారు. 'మమ్మీ-డాడీ కల్చర్ వదిలేయాలి. అమ్మ-నాన్న అనే మాటలను అలవాటు చేసుకోవాలి. మన భాషను మనమే ప్రమోట్ చేయాలి' అంటూ పిలుపునిచ్చారు.

ఇదే కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీతం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. బాలు చిన్ననాటి మిత్రుడు జీవి మురళిని మంత్రి శ్రీధర్ బాబు సన్మానించారు. అలాగే ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని రూపొందించిన శిల్పి వడయార్‌ను కూడా

2లో

## హౌస్ అరెస్టుల మధ్య ,,,,
### ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహావిష్కరణ




**హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే హైదరాబాద్) :** హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఆవిష్కరణపై వివాదం నెలకొన్న సంగతి తెలిసందే. ఆయన విగ్రహం పెట్టడాన్ని తెలంగాణ వాదులు వ్యతిరేకిస్తున్నారు. సోమవారం ఆయన విగ్రహం ఆవిష్కరణ నేపథ్యంలో నిరసన తెలిపేందుకు తెలంగాణ వాదులు సిద్ధమయ్యారు. దీంతో వారిని పోలీసులు హౌస్ అరెస్టు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా కార్యక్రమానికి ఎలాంటి అవాంతరాలు కలగకుండా రవీంద్ర భారతితో పాటు.. పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు. అయితే షెడ్యూల్ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించాల్సి ఉన్నా.. ఆయన ఢిల్లీకి వెళ్లడంతో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా సోమవారం.. ఎస్పీ బాలు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.

**వివాదంపై ఎస్పీ శైలజ స్పందన..**

ఎస్పీబాలు విగ్రహావిష్కరణ సందర్భంగా వివాదంపై ఆయన చెల్లి, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ స్పందించారు. ఎస్పీ బాలు గాయకులందరికీ స్ఫూర్తిదాయకం అని అన్న శైలజ.. ఒక అన్నయ్యగా తనకు కూడా ఓ కొత్త మార్గాన్ని ఇచ్చారని చెప్పారు. బాలసుబ్రమణ్యం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నానని వెల్లడించారు. బాలు బతికి ఉన్నపుడే.. ఘంటసాల విగ్రహం పక్కన తన విగ్రహవం పెట్టాలని చెప్పినట్లు గుర్తుచేశారు. ఈ క్రమంలో అన్నయ్య విగ్రహం

2లో

## గ్యారెంటీల అమలులో వైఫల్యమే కాంగ్రెస్ ఓటమికి కారణమన్న కేటీఆర్



**హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే హైదరాబాద్) :**రెండో దశ పంచాయతీ ఎన్నికల ఫలితాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరాచక పాలనకు చెంపపెట్టు లాంటివని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అడ్డదారిలో గద్దెనెక్కిందని, ఇప్పుడు ఆ పార్టీకి రాష్ట్రంలో కాలం చెల్లిందని పల్లె ప్రజలు తమ ఓటు ద్వారా స్పష్టమైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో అద్వితీయ ఫలితాలు సాధించిన బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ

2లో

## 2029లో సీఎంగా కల్వకుంట్ల కవిత.



**హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే హైదరాబాద్) :** గత కొద్ది కాలంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయాల్లో చాలా చురుగ్గా ఉంటున్నారు. కుటుంబం, బీఆర్ఎస్ పార్టీ నుంచి బయట వచ్చి.. ఆ పార్టీ నాయకులపై తీవ్రంగా

2లో

# ఖాకీ వదిలి ఖద్దరులోకి..

అంచెలంచెలుగా ఎస్సై స్థాయికి ఎదిగిన ఆయన, తన ఉన్నతికి కారణమైన సొంత గ్రామానికి ఏదైనా సేవ చేయాలని భావించారు. ఈ ఆలోచనతోనే, మరో ఐదు నెలల పదవీ కాలం మిగిలి ఉండగానే, తన 'ఖాకీ' యూనిఫామ్‌ను వదిలిపెట్టి స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారు. గ్రామ సేవ చేయాలనే బలమైన కోరికతో ఆయన పంచాయతీ ఎన్నికల్లో గ్రామ సర్పంచ్‌గా పోటీ చేయడానికి సిద్ధమయ్యారు. అధికార కాంగ్రెస్ పార్టీ తరఫున ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసుకుని ఎన్నికల బరిలోకి దిగారు.ఒక మాజీ ఎస్సై, పైగా అధికార పార్టీ అభ్యర్థి కావడంతో పులి వెంకటేశ్వర్లు విజయం నల్లేరు మీద నడకే అవుతుందని అందరూ బలంగా విశ్వసించారు. ఆయన సునాయాసంగా గెలుస్తారని భావించారు. కానీ, ఎన్నికల ఫలితం పూర్తిగా భిన్నంగా వెలువడింది. వెంకటేశ్వర్లు అనుకున్నది ఒకటైతే, జరిగింది మరొకటి. ఆదివారం వెలువడిన ఎన్నికల ఫలితాలు వెంకటేశ్వర్లుకు మరియు ఆయన మద్దతుదారులకు షాక్ ఇచ్చాయి. ఆశ్చర్యకరంగా, కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి, రేషన్ డీలర్ నాగయ్య చేతిలో ఆయన ఓటమి పాలయ్యారు.వెంకటేశ్వర్లు కేవలం 10 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ప్రజలు ఎవరిని గెలిపించాలో, ఎవరిని ఓడించాలో తమ నిర్ణయాన్ని స్పష్టంగా వెల్లడించారు. ఉన్నతమైన హోదాలో ఉన్నంత మాత్రాన, రాజీనామా చేసి రాజకీయాల్లోకి వస్తే ప్రజలు ఓట్లు వేస్తారనే ధీమా పెట్టుకోవడం సరికాదని ఈ ఫలితం నిరూపించింది. కేవలం 'ఫ్యాషన్'గా భావించి రాజకీయాల్లోకి వచ్చే వారికి ప్రజలు సరైన గుణపాఠం చెబుతారనడానికి ఈ సంఘటనే ఒక ఉదాహరణ.

# సీతారామపురంలో ఉద్రిక్తత..

## ఎన్నికల అధికారిని గదిలో బంధించిన గ్రామస్థులు

కొన్నిచోట్ల ఆందోళన చేస్తున్నారు. తమ వద్ద డబ్బు తీసుకొని వేరే వాళ్లను గెలిపించారని ఆరోపిస్తూ.. తిరిగి డబ్బు చెల్లించాల్సిందిగా ఓటర్లను ఒత్తిడి చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గెలిచిన అభ్యర్థులపై ఓడిన అభ్యర్థులు దాడులకు పాల్పడుతున్నారు. వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఓడిన అభ్యర్థిపై గెలిచిన అభ్యర్థి బంధువులు దాడికి పాల్పడ్డారు.

కామారెడ్డి జిల్లా సోమార్‌పేటలో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి బాలరాజును గెలిచిన సర్పంచ్ తమ్ముడు ట్రాక్టర్ తో ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సర్పంచ్ గా గెలిచిన పాపయ్య తమ్ముడు చిరంజీవికి, ఓడిన బాలరాజు వర్గంతో గొడవలు జరిగాయి. ఆది మనసులో పెట్టుకొని ట్రాక్టర్ తో ఢీకొట్టి ప్రత్యర్థులపై తన కక్ష తీర్చుకున్నాడు. గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# హౌస్ అరెస్టుల మధ్య ,,,,

## ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహావిష్కరణ

గురించి నిరసనలు తనకు తెలియదని.. విగ్రహ ఏర్పాటులో తన ప్రమేయం ఏమీ లేదని, మొత్తం సంగీతం బృందం కమిటీ చూసుకుందన్నారు. అంతేకాకుండా బాలు గురించి తెలియని వారంటూ ఎవరూ ఉండరన్నారు.కాగా, కొన్ని రోజుల క్రితం ఎస్పీ బాలు విగ్రహం ఆవిష్కరణ విషయంపై రవీంద్ర భారతి వద్దకు వచ్చారు బాలు బావమరిది, నటుడు శుభలేఖ సుధాకర్. ఈ సమయంలో ఆయనతో ఉద్యమకారుడు పృథ్వీరాజ్‌తో పాటు మరికొంతమంది వాగ్వాదానికి దిగారు. తెలంగాణలో బాలసుబ్రహ్మణ్యం విగ్రహం పెట్టడానికి వీలు లేదంటూ హెచ్చరించారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని పృథ్వీరాజ్‌తో పాటు మరికొందరు తెలంగాణ ఉద్యమ కారులను అక్కడ నుంచి పంపించారు.కాగా, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని పాడటానికి నిరాకరించారని.. అందుకే ఎస్పీ బాలు విగ్రహాన్ని ఎట్టిపరిస్థితిల్లోనూ ఏర్పాటు చేయొద్దంటూ తెలంగాణ వాదులు డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి కళాకారులు చాలా మంది ఉన్నారని, వారి విగ్రహాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ విషయంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కూడా తెలంగాణ ఉద్యమకారులకు మద్దతు తెలిపారు. బాలు విగ్రహం రవీంధ్ర భారతి వద్ద పెట్టడం సరికాదన్నారు. విగ్రహం పెట్టడానికి వేరే స్థలం చూసుకోవాలని చెప్పారు.

# నేను ఇప్పుడు తెలంగాణ వాన్ని.

ఘనంగా సన్మానించారు. సంగీతం, సంస్కృతి, భాష పట్ల ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చూపిన అంకితభావాన్ని ఈ విగ్రహం ఎప్పటికీ గుర్తు చేస్తుందని పలువురు సినీ ప్రముఖులు అభిప్రాయపడ్డారు. రవీంద్ర భారతి వేదికగా జరిగిన ఈ కార్యక్రమం సంగీతాభిమానులకు భావోద్వేగ క్షణాలను అందించింది.

# 2029లో సీఎంగా కల్వకుంట్ల కవిత.

విమర్శలు చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు. మరోవైపు అధికార పక్షంపై కూడా విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో కవిత సొంతంగా పార్టీ పెట్టే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కవిత కీలక ప్రకటన చేశారు. 2029లో తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు ఎక్స్ వేదికగా ఆస్క్ కవిత పేరుతో క్వశ్చన్ అవర్ నిర్వహించిన సందర్భంగా కవిత ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో "మీ కొత్త పార్టీ పేరు ఏంటి?" అని ఓ నెటిజన్ అడగగా.. ఆ పేరు ఎలా ఉండాలో చెప్పాలంటూ కవిత బదులిచ్చారు.కాగా, భారత్ వందో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2047 నాటికి మీ విజన్, మిషన్ ఏంటి అని నెటిజన్ అడిగాడు. దీనికి బదులిస్తూ.. నాణ్యమైన ఉచిత విద్య, నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే తన విజన్, తన మిషన్ అని కవిత పేర్కొన్నారు. ఇక తెలంగాణ జాగృతి కార్యక్రమాలు నగరాలకే ఎందుకు పరిమితమయ్యాయని అడిగిన ప్రశ్నకు.. త్వరలో జాగృతిని గ్రామాలకు విస్తరిస్తానని కల్వకుంట్ల కవిత చెప్పారు. ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.తమిళనాడులో జయలలిత ఎలా స్వతంత్ర నాయకత్వంతో ప్రజల విశ్వాసం సంపాదించారో, అలాగే మీరు కూడా ముఖ్యమంత్రి అయితే ప్రజలకు అంకితమైన బలమైన నాయకత్వం అందిస్తారని ఆశిస్తున్నామని అన్న ఓ నెటిజన్ పోస్టుకు సానుకూలంగా స్పందించారు కవిత. అంతేకాకుండా ఇటీవల 'నాకు కూడా టైం వస్తుంది, నేను కూడా ఏదో ఒక రోజు ముఖ్యమంత్రి అవుతాను' అంటూ కవిత ధీమా వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో 2029లో కవిత సీఎం అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది.

# గ్యారెంటీల అమలులో వైఫల్యమే కాంగ్రెస్ ఓటమికి కారణమన్న కేటీఆర్

ప్రభుత్వ పెద్దలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ కోటలు బీటలు వారడం రాష్ట్రంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రానికి నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో సైతం బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు సత్తా చాటారని, ఇందుకు కృషి చేసిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రేవంత్ రెడ్డి రెండేళ్ల పరిపాలనా వైఫల్యాలు, గ్యారెంటీల అమలులో చేసిన ఘోరమైన మోసాలే కాంగ్రెస్ పార్టీకి ఉరితాళ్లుగా మారాయని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఈ వైఫల్యాలే ఆ పార్టీని ప్రజాక్షేత్రంలో కూకటివేళ్లతో పెకిలిస్తున్నాయని ఉద్ఘాటించారు.గతంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా విజయాలు సాధించిందని, కానీ నేడు కాంగ్రెస్ కనీసం సగం పంచాయతీలను కూడా గెలవలేకపోయిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇది అధికార పార్టీపై పల్లెల్లో పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతమని వివరించారు. పార్టీ గుర్తు లేని ఎన్నికల్లోనే పరిస్థితి ఇలా ఉంటే, ఇక పార్టీ గుర్తుపై జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఇంతకన్నా ఘోర పరాభవం తప్పదని జోస్యం చెప్పారు.కాంగ్రెస్ అభయహస్తం కాదని, అదొక రిక్త హస్తమని రెండేళ్ల పాలనలోనే తేలిపోయిందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నాటికి రేవంత్ అసమర్థ పాలనలో అధికార పార్టీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి తెలంగాణను విడిపించే పోరాటంలో తమకు అండగా నిలుస్తున్న ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనాలు తెలుపుతున్నట్లు చెప్పారు. కష్టకాలంలో పార్టీ వెన్నంటి నిలిచిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, వారి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు పార్టీ బంగారు బాటలు వేస్తుందని కేటీఆర్ హామీ ఇచ్చారు.

## ఉపాధి హామీ పథకం అమలుపై..

# మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు..

తెరలేపుతోందని విమర్శించారు.కేంద్రం తీసుకుంటున్న ఈ విధానం గ్రామీణ పేదలను, రాష్ట్రాలను శిక్షించే విధంగా ఉందని ఆమె ఆక్షేపించారు. పథకం అమలులో కేంద్రం తన నిధుల వాటాను తగ్గించడంపై మంత్రి సీతక్క అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో ఈ పథకానికి వంద శాతం నిధులు వెచ్చించిన కేంద్రం.. ఇప్పుడు తన వాటాను 60 శాతానికి తగ్గించి, మిగిలిన 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం అన్యాయమని సీతక్క అన్నారు. ఈ నిర్ణయం రాష్ట్రాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపే నిర్ణయమని.. కేంద్రం తన 'బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నమే'నని ఆమె విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని , గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు జీవనోపాధి భద్రత కల్పించే ఈ కీలకమైన పథకాన్ని కొనసాగించాలని ఆమె డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆధార స్తంభం వంటిదని, దీనిని బలహీనపరచడం దేశాభివృద్ధికి ఏ మాత్రం మంచిది కాదని ఆమె సూచించారు.


# మక్త అనంతరం 4వ వార్డ్ గెలిచిన శ్రీధర్ ముదిరాజ్



**బీబీనగర్ డిసెంబర్ 15 (నమస్తే హైదరాబాద్)** యాదాద్రి జిల్లా, బీబీనగర్ మండల్, మక్త అనంతరం జరిగిన ఎన్నికలలో నాలుగో వార్డ్ అభ్యర్థి శ్రీధర్ ముదిరాజ్ బి.అర్.ఎస్ పార్టీ నుంచి ఘనవిజయం సాధించడం జరిగింది. శ్రీధర్ మాట్లాడుతూ నన్ను గెలిపించిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలుపుతూ నా శక్తి మేరకు ప్రజలందరికీ మంచి చేస్తానని హామీ ఇచ్చారు.

# మక్త అనంతరం సర్పంచ్ గా కేలేందర్ ముదిరాజ్

**బీబీనగర్ డిసెంబర్ 15 (నమస్తే హైదరాబాద్)** యాదాద్రి జిల్లా, బీబీనగర్ మండల్, మక్త అనంతరం జరిగిన ఎన్నికలలో సర్పంచ్ పదవిని కైవసం చేసుకున్న కిలేందర్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నుంచి ఘనవిజయం సాధించడం జరిగింది. కిలేందర్ మాట్లాడుతూ నన్ను గెలిపించిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలుపుతూ గ్రామం అంతా నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, గ్రామాభివృద్ధికి పాటుపడతానని అన్నారు.



# వెహికల్ చెకింగ్ నిర్వహించిన ఎస్ హెచ్ ఓ బాలస్వామి



**ఘట్కేసర్ డిసెంబర్ 15 (నమస్తే హైదరాబాద్)**మేడ్చల్ జిల్లా, ఎల్బీనగర్ జోన్, ఘట్కేసర్ సర్కిల్ లోని ఎన్ఎఫ్సీ నగర్ చౌరస్తా వద్ద వెహికల్ చెకింగ్ నిర్వహించిన ఎస్ హెచ్ ఓ బాలస్వామి. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ అన్నివేళలా ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్ వేసుకోవాలని, తమ బండి పేపర్లు ఎల్లవేళలా తమ వద్ద ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హీన, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# దండిగం కొమురయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసిన కాంగ్రెస్ పార్టీ నగర ఉపాధ్యక్షులు .వస్కుల శ్రీనివాస్

**కాజీపేట నవంబర్ 15 నమస్తే హైదరాబాద్** గ్రేటర్ వరంగల్ 46 డివిజన్ మడికొండ గ్రామంలో లికీ?శే? దాసరి సుశీల గారి మరియు కీ?శే? దండిగం కొమురయ్య భౌతిక గాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ఇరు కుటుంబాలని పరామర్శించిన నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వస్కుల శ్రీను ఈ కార్యక్రమంలో 46 వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు మాజీ సర్పంచ్ వస్కుల వెంకటస్వామి,ఇందిరమ్మ కమిట్టే మెంబర్ శివ నాగరాజు,మెట్టుగుట్ట డైరెక్టర్ హనుమకొండ మల్లికార్జున్, బొజ్జశ్రీను, నమ్మిండ రాజు,వస్కుల రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటి ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,

**టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి**

**ఫుట్ బాల్ గుర్తుకు ఓటు వేయండి**

**రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు గంగరాజును గెలిపిస్తాయి**




**దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్):** దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి జక్కుల గంగరాజు ఫుట్ బాల్ గుర్తుకు ఓటు వేయాలని డప్పు చప్పులతో కోలాట బృందంతో భారీ ఎత్తున ఇంటింటి ప్రచారం నిర్వహించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి ప్రతి గడపగడపకు జోరుగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి జక్కుల గంగరాజు ఫుట్ బాల్ గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేయాలని దేవరుప్పుల గ్రామ ప్రజలకు తెలియజేశారు. గంగరాజును గెలిపిస్తే మీ గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఇతర పార్టీ వాళ్ళని



గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందా అని మీరే గ్రహించాలని ప్రజలకు తెలిపారు. పేద ప్రజల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాడని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారని అన్నారు. ఇల్లు లేని వాళ్లకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి జక్కుల గంగరాజు ఫుట్ బాల్ గుర్తుకు ఓట వేయాలని తెలిపారు. గంగరాజు ప్రజల కోసం సేవ చేస్తాడు ప్రజల మధ్యలో ఉంటాడు ఎవరికి ఆపద వచ్చిన వస్తాడు అలాంటి నాయకుడు గంగరాజు మాత్రమే అని తెలిపారు. సర్పంచ్ అభ్యర్థి గంగరాజును ప్రతి ఒక్కరు ఆశీర్వదించాలని తెలిపిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ధర్మారెడ్డి, బోనగిరియాకస్వామి, తోటకూరి పాండుకృష్ణ , గ్రామ అధ్యక్షుడు ఉప్పుల ఉప్పులయ్య , పల్లపు రవి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అస్తవ్యస్తంగా డివిజన్ల ఏర్పాటు..... బి.ఆర్.ఎస్ పార్టీ తీవ్ర నిరసన



**నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి :** జీహెచ్ఎంసీ పరిధిలో డివిజన్ల ఏర్పాటు పూర్తిగా అస్తవ్యస్తంగా, ప్రజలకు అన్యాయం జరిగేలా కొనసాగుతోందని మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి ఆరోపించారు. రికార్డుల్లో లేని మురికి కాలువలను హద్దులుగా చూపించడం, సుప్రీం కోర్టు కేసులో ఉన్న ప్రభుత్వ భూమిలో రోడ్ లేకపోయినా ఉన్నట్టుగా హద్దులు నిర్ణయించడం వంటి అక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.కాలనీలను రెండుగా చీల్చి డివిజన్లుగా నిర్ణయించడం, బస్తీలన్నింటినీ ఒక డివిజన్‌గా మరియు కాలనీలన్నింటినీ మరో డివిజన్‌గా విడగొట్టడం ద్వారా సమతుల్యత లేకుండా జనాభా పంపిణీ చేయడం జరిగిందని విమర్శించారు. ఒక డివిజన్‌కు తక్కువ జనాభా, మరో డివిజన్‌కు అధిక జనాభా చూపించడం ద్వారా అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు అనుకూలంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.అభ్యంతరాలు తెలపాలన్నా కనీసం మాప్‌లు కూడా ఇవ్వకుండా ప్రజలను, ప్రతిపక్షాలను పక్కన పెట్టే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు.ఈ ప్రజావ్యతిరేక, అస్తవ్యస్త డివిజన్ల ఏర్పాటును తీవ్రంగా ఖండిస్తూ బి.ఆర్.ఎస్ పార్టీ తరఫున శేరిలింగంపల్లి స్థానిక నాయకులతో కలిసి జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శశిరేఖ రెడ్డి లను కలిసి లిఖితపూర్వకంగా అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్ల రెడ్డి, రోజా, అల్లావుద్దీన్, గౌస్, అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాదాపూర్ గోకుల్ ప్లాట్స్ కాలనీలో అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ




**నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి :** మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీలో రూ. 1.45 కోట్ల అంచనావ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు, వరద నీటి కాల్వ నిర్మాణ పనులను పీఏసీ చైర్మన్,శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గోకుల్ ప్లాట్స్ కాలనీలో చేపట్టనున్న అభివృద్ధి పనులను త్వరితగతిన, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని, అసంపూర్తిగా ఉన్న వరద నీటి కాలువ పనులను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసీ డీఈ శ్రీదేవి, నాయకులు బ్రిక్ శ్రీనివాస్, గుమ్మడి శ్రీనివాస్, సాంబయ్య, సంజీవ రెడ్డి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# పహల్గాం ఉగ్రదాడి ప్రధాని సూత్రధారి సాజిద్ జాట్.. ఎన్ఐఏ ఛార్జిషీట్..

**నమస్తే హైదరాబాద్,** న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి కేసులో దర్యాప్తు చేస్తున్న నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ సోమవారంనాడు జమ్మూలోని ప్రత్యేక కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసింది. దాడి ప్రధాన సూత్రధారిగా పాకిస్థాన్ నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న లష్కరే తొయిబా కమాండర్ జాజిద్ జాట్ ను పేర్కొంది. హహల్గాం దాడి కేసులో లష్కరే తొయిబా, దాని ఫ్రంట్ ఆర్గనేజైషన్ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' తో సహా ఏడుగురు నిందితులపై ఎన్ఐఏ ఛార్జిషీటు నమోదు చేసింది. హహల్గాం దాడిలో పాకిస్థాన్ కుట్ర, నిందితుల పాత్ర, వాటిని బలపరచే సాక్ష్యాలను ఛార్జిషీటులో ఎన్ఐఏ చేర్చింది. నిషేధిత ఎల్ఈటీ/టీఆర్ఎఫ్ సంస్థ ఈ కుట్రకు ప్రణాళిక రచించి దాన్ని అమలు చేసినట్టు తెలిపింది. మతం పేరు అడిగిమరీ పాక్ స్పాన్సర్డ్ ఉగ్రవాదులు ఈ దారుణానికి పాల్పడ్డారని, ఒక పౌరుడు సహా 25 మంది టూరిస్టులను పొట్టనపెట్టుకున్నారని పేర్కొంది. ఈ మేరకు 1,597 పేజీల ఛార్జిషీటును ప్రత్యేక కోర్టుకు ఎన్ఐఏ సమర్పించింది. ఉగ్రదాడి అనంతరం జూలైలో చేపట్టిన ఆపరేషన్ మహదేవ్‌లో భారత బలగాలు మట్టుబెట్టిన ముగ్గురు పాక్ ఉగ్రవాదుల పేర్లను కూడా ఛార్జిషీటులో ఎన్ఐఏ చేర్చింది. ఈ ఉగ్రవాదులను ఫైసల్ జాట్ అలియాస్ సులేమాన్ షా, హబీబ్ తాహిర్ అలియాస్ జిబ్రాన్, హమ్జా అఫ్గానిగా పేర్కొంది. ఈ ముగ్గురితో పాటు సాజిద్ జాట్, ఎల్ఈటీ/టీఆర్ఎఫ్‌పై భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్) 2023, ఆయుధాల చట్టం-1959, చట్టవిరుద్ధ కార్యాకలాపాల నిరోధక చట్టం-1967లోని వివిధ సెక్షన్ల కింద అభియోగాలను మోపింది. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించారనే కారణంగా జూన్ 22న అరెస్టు చేసిన మరో ఇద్దరు నిందితులు పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్‌ల పేర్లను కూడా ఛార్జిషీటులో ఎన్ఐఏ చేర్చింది. ఇంటరాగేషన్‌లో ఈ ఇద్దరూ దాడిలో ప్రమేయమున్న మరో ముగ్గురు సాయుధ ఉగ్రవాదుల వివరాలను వెల్లడించారు. ఈ ముగ్గురూ ఎల్ఈటీ ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా పనిచేసిన పాక్ ఉగ్రవాదులని అంగీకరించారు. ఎవరీ సాజిద్ జాట్ పాక్‌కు చెందిన మోస్ట్ వాంటెండ్ టెర్రరిస్టు సాజిద్ జాట్. ఇతనిపై ఎన్ఐఏ రూ.10 లక్షల రివార్డు కూడా ప్రకటించింది. అతని అసలు పేరు హబీబుల్లా మాలిక్. పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్స్‌లోని కసూర్ జిల్లావాసి. సైఫుల్లా, నోమి, నూమన్, లంగ్డా, అలీ సాజిద్, ఉస్మాన్ హబీబ్, షాని అనే పేర్లు కూడా ఇతనికి ఉన్నాయి. టీఆర్ఎఫ్ టాప్ కమాండర్‌గా జమ్మూకశ్మీర్‌లో జరిగిన పలు ప్రధాన ఉగ్రదాడుల్లో ఇతని ప్రమేయం ఉంది. 2022 అక్టోబర్‌లో యూఏపీఏ కింద అధికారికంగా వాంటెడ్ టెర్రరిస్టుగా ప్రకటించారు. ఇస్లామాబాద్‌లో ఎల్ఈటీ ప్రధాన కార్యాలయం నుంచి ఇతను భారత్‌లో ఉగ్రవాదాన్ని నడిపించే నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నాడని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి.

# నిర్మాల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన పల్ల సుందర్ రాంరెడ్డి

## బ్యాటు గుర్తుకు ఓటు వేయాలని బిఆర్ఎస్ పార్టీ నాయకుల జోరు ప్రచారం





**దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్):** దేవరుప్పుల మండలం నీర్మాల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పల్లెర్ల సంధ్యారాణి గెలుపు కోసం సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి మీ అమూల్యమైన బ్యాటు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పల్ల సుందర్ రాం రెడ్డి గ్రామ ప్రజలకు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పల్లెర్ల సంధ్యారాణి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తారని. అందుకు మీ అమూల్యమైన ఓటు బ్యాటు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ కొత్త జలంధర్ రెడ్డి,దయాకర్ ,బద్రి, బిక్షపతి వడ్లకొండ ప్రశాంత్ ,నరసయ్య యుగంధర్ ,నరేష్, మహేందర్ ,రామ్ దయాకర్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిక

## కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి





**దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్ )**దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్మల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మేడ విద్య సాగర్. మేడ లక్ష్మయ్య. మల్లమ్మ. జోగు బాల రాజు. కొత్త సమ్మిరెడ్డి. కట్ట ఐలయ్య. ఆరూరి నరసింహులు. సింగారపు మధు. సోమవారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీని వీడి. కాంగ్రెస్ పార్టీలో చేరినారు. చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజలకు ఇస్తున్న సంక్షేమ పథకాలను చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కట్ట అనిత ఉంగరం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం కొడకండ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల అండాలు సిపిఎం జనగాం జిల్లా కార్యదర్శి సభ్యులు సింగారపు రమేష్, వెంకన్న బిక్షపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు కొత్త దయాకర్ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కడబోయిన గణేష్, కడబోయిన వెంకన్న, యూత్ అధ్యక్షుడు నల్ల రాజు కార్యక్రమంలో తదితరులు, పాల్గొన్నారు.

# పలు డివిజన్లో శంకుస్థాపన చేసిన పశ్చిమ శాసనసభ్యులు. నాయిని రాజేందర్ రెడ్డి





**కాజిపేట్ నవంబర్ 15 నమస్తే హైదరాబాద్** ప్రతి కాలనీ అభివృద్ధి లక్ష్యంగా 47 డివిజన్ 60 లక్షల ఎమ్మెల్యే సి డి ఎఫ్ ఫండ్ బోడగుట్టలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ప్రజలు సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పశ్చిమ నియోజవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు అనంతరం 47 డివిజన్ బోడగుట్ట గ్రామానికి ప్రధాన రహదారి నుంచి రోడ్డు వెడల్పు చేయాలని స్థానిక ప్రజలు కోరగా సంబంధిత అధికారులకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు ఇట్టి కార్యక్రమం 47 డివిజన్ మాజీ అధ్యక్షుడు దొంగల కుమార్ గారి ఆధ్వర్యంలో జరిగింది కార్యక్రమంలో 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ 63 డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రజాలి మాజీ కార్పొరేటర్ బకర్ మాజీ కార్పొరేటర్ గోల్కొండ రాంబాబు 47 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ అజ్గర్ కాజీపేట కార్మికుల గౌరవ అధ్యక్షుడు 47 డివిజన్ కాంగ్రెస్ నాయకులు మైసరపు సిరిల్ లారెన్స్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్ప శ్రీకాంత్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి బిలాల్ మైనార్టీ వైస్ చైర్మన్ డబ్బు బర్ల రాజ్ కుమార్ బొబ్బిలి నాగరాజు పోగుల శ్రీనివాస్ సిల్వేరి మల్లికార్జున్ఇమ్మడి రవి మాతంగి స్వామి ఎండి మదర్ దార్ల రాజ్ కుమార్ గుండాల రవికుమార్ జిమ్ము సదానందం కుమారు వీరస్వామి బోడగుట్ట స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# అడ్డగోలుగా జీహెచ్ఎంసీ డివిజన్ల విభజన.....

## ప్రజలకు స్పష్టత ఇవ్వాలి : రవికుమార్ యాదవ్



**నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి :** జీహెచ్ఎంసీ పరిధిలో డివిజన్ల విభజనను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఇష్టారీతిగా చేపట్టిందని బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ తీవ్ర విమర్శలు చేశారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న ప్రాంతాలను జీహెచ్ఎంసీ పరిధిలోకి తీసుకువస్తూ, ఇప్పటికే ఉన్న డివిజన్లను విభజించి మొత్తం 300 డివిజన్లుగా రూపొందించడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు.డివిజన్ల సరిహద్దులను ప్రకటిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోపై అభ్యంతరాలు తెలుపుతూ, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు, బీజేపీ తెలంగాణ డెలిమిటేషన్ మానిటరింగ్ కమిటీ కన్వీనర్ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌తో పాటు శేరిలింగంపల్లి బీజేపీ నాయకులు పాల్గొన్నారు. రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ, శేరిలింగంపల్లి డివిజన్ విభజనలో దాదాపు 70 వేల ఓటర్లు అలాగే మిగిలిపోయారని తెలిపారు. మసీద్ బండ డివిజన్‌ను కేవలం 12 బూతులకే పరిమితం చేయడం అన్యాయమన్నారు. పాపిరెడ్డి కాలనీ, రాజీవ్ గృహ కల్ప, ఆరంభ టౌన్‌షిప్, సందయ్య నగర్, సురభి కాలనీ నుంచి గోపి చెరువు నాలా మీదుగా చాకలి చెరువు నాలా వరకు ఉన్న అరబిందో గ్రేటర్ కమ్యూనిటీ ప్రాంతాలను మసీద్ బండ డివిజన్‌లో కలపాలని డిమాండ్ చేశారు.అలాగే బీకే ఎన్‌క్లేవ్ డివిజన్‌ను మక్త గ్రామస్థుల కోరిక మేరకు మక్త మహబూబ్‌పేట్ డివిజన్‌గా మార్చాలని, మాతృశ్రీ నగర్ డివిజన్ సరిహద్దుల ఏర్పాటు కూడా పూర్తిగా గందరగోళంగా ఉందన్నారు. డివిజన్ల విభజన జనాభా ప్రాతిపదికన జరిగిందా లేదా ఓటర్ల జాబితా ఆధారంగా జరిగిందా అనే విషయాన్ని ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. గూగుల్ మ్యాప్ ఆధారంగా డివిజన్లను విభజించడం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమన్నారు.ప్రజల నుంచి, రాజకీయ పార్టీల నుంచి ఎలాంటి సూచనలు తీసుకోకుండా డివిజన్ల విభజన చేపట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సరిహద్దుల ప్రకారం ఏ కాలనీ, ఏ బస్తీ ఏ డివిజన్ పరిధిలోకి వస్తుందో ప్రభుత్వానికే స్పష్టత లేదని ప్రశ్నించారు.ఇదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తే, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని, ప్రభుత్వం చేస్తున్న ప్రతి చర్యను గమనిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు మహిపాల్ రెడ్డి, బుచ్చి రెడ్డి, ఎల్లేష్, సీనియర్ నాయకులు వసంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల గిరి సర్పంచ్ గా చేరుపల్లి మమత గెలుపు ఖాయం





## –మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** పాలకుర్తి మండల పరిధిలోని తిరుమల గిరి సర్పంచ్ గా మమత ని భారీ మెజారిటీ తో గెలిపించాలని అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి లు పిలుపునిచ్చారు.
సోమవారం సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.
ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ఆయన అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు.బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కార్యకర్తలు, నేతలు సమన్వయంతో కలిసి పని చేయాలని ఆయన కోరారు. కేసీఆర్ నేతృత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి, అభివృద్ధి గురించి గ్రామస్తులకు వివరించి చైతన్యపరచాలని కోరారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయకేతనం మనదే అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కార్పొరేటర్లు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం: సోమ శ్రీనివాస్ గుప్త



**నమస్తే హైదరాబాద్ :** బాబుల్ రెడ్డి నగర్ మాజీ వార్డు మెంబర్ సోమ శ్రీనివాస్ గుప్త, అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన పోరాటాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా సోమవారం కాటేదాన్‌లోని శ్రీ వాసవి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో, ఆయన విగ్రహానికి నివాళులర్పించి, ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా, దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాంది పలికిన ఆయన నిబద్ధత అందరికీ శిరోధార్యమని అన్నారు. తెలుగు ప్రజల అస్తిత్వం కోసం 58 రోజుల పాటు మృత్యువుతో పోరాడి, ప్రాణాలను త్యాగం చేసిన ఆయన త్యాగం స్ఫూర్తిదాయకమని తెలిపారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ కు ఘనంగా నివాళులర్పించిన కార్పొరేటర్లు కక్కిరేణి చేతన హరీష్, బండారు శ్రీవాణి వెంకటరావు





**ఉప్పల్ డిసెంబర్ 15 ( నమస్తే హైదరాబాద్):** భారత ఐక్యత సమగ్రతకు కృషిచేసిన ఐక్యతమూర్తి, భారత తొలి ఉప ప్రధాని, భారతరత్న ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా రామంతపూర్ ప్రధాన రహదారిలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్,రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు లు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ దేశం కోసం ఆయన చేసిన అపూర్వమైన త్యాగాలు, అవిశ్రాంత స్మరించుకుంటూ సేవలను ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత స్వాతంత్ర్యానంతరం 5005 పైగా స్వదేశీ సంస్థానాలను భారత యూనియన్ విలీనం చేయడంలో ఆయన ప్రదర్శించిన దార్శనికత, ధైర్యసాహసాలు చిరస్మరణీయమైనవి. ఆయన ఆత్మ శాంతి కలగాలని కోరుకుంటూ, దేశ నిర్మాణంలో ఆయన పోషించిన కీలక పాత్రను కొనియాడారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మాజీ కౌన్సిలర్ తిండేరు హనుమంతరావు, హబ్సిగూడ ప్రధాన కార్యదర్శులు చెల్లోజు ఎల్లాచారి, చింతకింది ప్రవీణ్ ,గడ్డం సాయికిరణ్ ,బండి పద్మ ,దారం వెంకటేష్ గుప్త,పీసరి శంకర్, పుచ్చుల అశోక్,జి హరిబాబు,నందికంటి శివ,గడ్డం వెంకట్ సాయి, తుమ్మలి రవి, తోట శ్రీనివాస్,గుర్రం మహేష్, రామంతపూర్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ గుప్తా ,తాల్ల బాలకృష్ణ గౌడ్,మత్తినేని జగదీష్,వల్లపు జగన్ యాదవ్, ఎంపటి శ్రీనివాస్ ,,పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి పలుగుల అంజయ్య, దర్శనాల సుధాకర్ ,ఉపేందర్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ: విత్తన రంగంలో అగ్రగామిగా - నూతన విధానంతో మెగా ప్లాన్




తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర విత్తన రంగాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు ప్రతిష్టాత్మకమైన నూతన విధానాన్ని రూపొందించింది. ఈ విధానం యొక్క ప్రధాన లక్ష్యం విత్తన ఉత్పత్తి మరియు ఎగుమతులలో రాష్ట్రాన్ని జాతీయ స్థాయిలో అగ్రగామిగా మార్చడం. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు సమగ్రమైన ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందులో అత్యాధునిక పరిశోధన సౌకర్యాలను కల్పించడం, ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచడం, మరియు ఎగుమతి ప్రక్రియలను సులభతరం చేయడం వంటి కీలక అంశాలను పొందుపరిచారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం యొక్క ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ కొత్త విధానం కీలకపాత్ర పోషించనుంది.
ఈ నూతన విధానంలో భాగంగా, విత్తన పరిశోధన మరియు అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వబడుతోంది. ఇందుకోసం రాష్ట్రంలో ఒక సీడ్ రీసెర్చ్ పార్కు (%వావవస =వంమ్ముతీఎష్ట్ర్రాఖుతీని%) నెలకొల్పాలని నిర్ణయించారు. ఈ పరిశోధనా కేంద్రం ద్వారా, వాతావరణ మార్పులను తట్టుకునే, అధిక దిగుబడిని ఇచ్చే మరియు చీడపీడల నిరోధకత గల నూతన వంగడాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించబడుతుంది. రైతులు నాణ్యమైన విత్తనాలను పొందడం ద్వారా, వారు తమ పంట దిగుబడులను పెంచుకోగలుగుతారు. ఈ పరిశోధనా కేంద్రం, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విత్తన నాణ్యతను పరీక్షించి, ధృవీకరించే వ్యవస్థగా కూడా పనిచేయనుంది.
ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా, ప్రభుత్వం కొత్తగా 100 విత్తన ఉత్పత్తి కేంద్రాలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కేంద్రాలలో ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి, పకడ్బందీ పర్యవేక్షణతో విత్తన ఉత్పత్తి ప్రక్రియను చేపట్టనున్నారు. ఈ విస్తృతమైన ఉత్పత్తి నెట్‌వర్క్ ద్వారా సుమారు 25 లక్షల టన్నుల అధిక నాణ్యత గల విత్తనాలను ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించుకుంది. ఈ భారీ ఉత్పత్తి లక్ష్యం, కేవలం రాష్ట్ర అవసరాలను తీర్చడమే కాకుండా, మిగులు విత్తనాలను దేశీయ మరియు అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేయడానికి మార్గం సుగమం చేస్తుంది.
విత్తనాల ఎగుమతి ప్రక్రియను సులభతరం చేయడానికి మరియు అంతర్జాతీయ మార్కెట్లకు రాష్ట్ర విత్తనాలను వేగంగా చేర్చడానికి, ప్రభుత్వం ఒక కీలకమైన మౌలిక సదుపాయాన్ని ఏర్పాటు చేయనుంది. అదే 'ఇన్‌లాండ్ సీడ్ ఎక్స్‌పోర్ట్ ఫెసిలిటేషన్ పోర్ట్' ఈ ప్రత్యేకమైన పోర్ట్, ఎగుమతికి సంబంధించిన అన్ని లాజిస్టికల్ అవసరాలను తీరుస్తుంది, తద్వారా అంతర్జాతీయ వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ సమగ్ర ప్రణాళిక వివరాలను 'తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్'లో పొందుపరిచారు, ఇది రాష్ట్ర విత్తన పరిశ్రమ భవిష్యత్తుపై ప్రభుత్వ నిబద్ధతను స్పష్టం చేస్తోంది.

# మధుయాష్కి గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గడ్డం రవికుమార్





**ఉప్పల్, డిసెంబర్ 15 ( నమస్తే హైదరాబాద్):** టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ జన్మదినోత్సవం సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, యువ కాపునాడు ఉపాధ్యక్షులు గడ్డం రవికుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గడ్డం రవికుమార్ మాట్లాడుతూ ఆయనకు మంచి ఆరోగ్యం, ఆనందం మరియు సుదీర్ఘ జీవితం కలగాలని కోరుకుంటున్నాము. ఆయన ప్రజలకు మరింత సేవ చేయాలని, ఆయన మార్గదర్శకత్వం ఎల్లప్పుడూ ఉండాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

# వెలుగులోకి మావోయిస్ట్ డాక్యుమెంట్.. కీలక అంశాలు ఇవే..

**నమస్తే హైదరాబాద్):** మావోయిస్ట్ పార్టీ పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ డాక్యుమెంట్‌లోని కీలక అంశాలు విషయానికి వస్తే.. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన 'ఆపరేషన్ కగార్' అణిచివేత చర్యలను ఖండించాలి. ఈ ఆపరేషన్స్ వల్ల నిరపరాధులైన ఆదివాసీల జీవితాలకు ముప్పు వాటిల్లుతుంది. ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలోకి వెళ్లేందుకు సిద్ధం.. కానీ ప్రభుత్వం సాయుధ కాల్పులు విరమణ ప్రకటించాలి. భద్రతా దళాల శిబిరాల ఏర్పాటు నిలిపివేయాలి. గడిచిన మూడేళ్లలో 683 మంది చనిపోయారు. అందులో 190 మంది మహిళలు ఉన్నారు. మావోయిస్టులు 669 ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో 261 పోలీసులు మృతిచెందగా.. 516 మంది గాయపడ్డారు. 25కి పైగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాం. 2019 పార్టీ వారోత్సవంలో కీలక నిర్ణయం తీసుకుంది. మారుతున్న పరిస్థితులకు తగ్గట్టుగా పార్టీ క్యాడర్ ని బలపతం చేయాలని అనేక మార్పులు చేయాలని భావిస్తున్నట్లు డాక్యుమెంట్ లో పేర్కొన్నారు.
2021 నుంచి పార్టీ కీలక నేతలను కోల్పోయింది. వీరిలో నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు లక్కు ,అంబీర్, సాకేత్ ,ఆనంద్ అనారోగ్యం కారణంగా చనిపోయారు. ఇది



ఒక రకంగా పార్టీకి పెద్ద దెబ్బ. తర్వాత చాలా పోలీసుల ఎన్‌కౌంటర్ లో చనిపోగా.. మరికొంత మంది అరెస్టు అయ్యారు. ఈస్ట్ వైపు సెంట్రల్ రీజన్స్‌లో కమిటీల మధ్య సమన్వయం లేక పోవడంతో అనేకమందిని కోల్పోయి పార్టీ బలహీన పడింది. 2020 లో జరిగిన పొలిట్ బ్యూరోలో పలు విషయాలు చర్చించాము. ముఖ్యంగా మాస్ బేస్ ని ఆకర్షించేలా వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేయాలి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా దేశాన్ని మొత్తం 7 ఏరియాలలో విభజించాము. పార్టీలో కొంత కాలంగా సీక్రెట్స్ రివీల్ అవుతున్నాయి. వాటిని పరిగణలోకి తీసుకొని 2012 నుంచి 2013 వరకు ఎన్నో లోటుపాట్లను రెక్టిఫై చేసుకున్నాం. దేశవ్యాప్తంగా ప్రజలకు ఏ సమస్య ఉన్నా, మన సమస్యగా పోరాడాలి. పార్టీలో రిక్రూట్మెంట్ నిరంతరంగా కొనసాగాలి.. ప్రతి చర్యపై సోషల్ ఇన్వెస్టిగేషన్ జరగాల్సిందే. ఎప్పుడైనా మాస్ ఆర్గనైజేషన్‌లో పట్టు ఉన్నప్పుడే పార్టీ కోలుకోగలుగుతుంది. ఇప్పటికే చాలా నష్టపోయాం.. వీటి నుంచి ఎన్నో పాఠాలను చేర్చుకోవాల్సిన అవసరం ఉంది. పార్టీ కమిటీలలో మూడు జనరేషన్లో ఉండేలా చూసుకోవాలి. ఒక సీనియర్ సభ్యుడుతో పాటు, మిడిల్ ఏజ్ వ్యక్తితో పాటు యువకుడిని కమిటీలో పెట్టుకోవాలి. మారుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు గ్రౌండ్ లెవెల్లో సర్వేలు నిర్వహించి ఎప్పటికప్పుడు ప్లేస్ లు మారుస్తూ ఉండాలి. మొత్తానికి 2024 లో మావోయిస్ట్ పార్టీ డాక్యుమెంట్లు భద్రతా దళాల ఒత్తిడిని అంగీకరిస్తూ.. ఓ వైపు శాంతి చర్చలకు సంకేతాలు ఇస్తూ.. మరోవైపు అంతర్గత పార్టీని బలోపతం చేసుకోవాలి, లొంగుబాట్లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చినట్లు తెలుస్తుంది.

## నారా లోకేశ్ ఆసక్తికర సోషల్ మీడియా పోస్ట్



**నమస్తే హైదరాబాద్ :** నారా లోకేశ్ సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, త్వరలో విశాఖపట్నానికి ప్రపంచ ఛాంపియన్లు రాబోతున్నారని వెల్లడించారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా వైజాగ్ ప్రజల్లో తీవ్ర కుతూహలం నెలకొంది."వైజాగ్ సిద్ధంగా ఉండు. ఈ నెలలోనే ప్రపంచ ఛాంపియన్లు వస్తున్నారు. వారెవరో ఎవరైనా ఊహించగలరా అంటూ లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ చిన్న పోస్ట్ ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. వస్తున్నది క్రీడా రంగానికి చెందినవారా, లేక టెక్నాలజీ లేదా వ్యాపార రంగంలోని దిగ్గజాలా అనే దానిపై ఊహాగానాలు మొదలయ్యాయి.సాధారణంగా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి వెల్లడించే లోకేశ్, ఇలా సస్పెన్స్ క్రియేట్ చేస్తూ పోస్ట్ పెట్టడంతో అందరిలోనూ ఆసక్తి పెరిగింది. విశాఖను అంతర్జాతీయంగా మరింత ఉన్నత స్థాయిలో నిలబెట్టేందుకే ఈ కార్యక్రమం అని పలువురు భావిస్తున్నారు. ఆ ప్రపంచ ఛాంపియన్లు ఎవరు, వారు ఏ రంగంలో నిష్ణాతులు అనే వివరాలు తెలియాలంటే మంత్రి నుంచి రాబోయే అధికారిక ప్రకటన వరకు వేచి చూడాల్సిందే.

## నరసాపురం-చెన్నై వందేభారత్ రైలుకు పచ్చజెండా



**నమస్తే హైదరాబాద్ :** కోస్తాంధ్ర, తమిళనాడు మధ్య ప్రయాణించే వారికి శుభవార్త. నరసాపురం-చెన్నై మధ్య ప్రతిష్ఠాత్మక వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సేవలు సోమవారం ప్రారంభమయ్యాయి. నరసాపురం రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి, రైల్వే శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ ఈ రైలుకు పచ్చజెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, స్థానిక జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తదితరులు పాల్గొన్నారు.ఇప్పటివరకు చెన్నై సెంట్రల్-విజయవాడ మధ్య నడుస్తున్న ఈ సెమీ-హైస్పీడ్ రైలును గుడివాడ, భీమవరం మీదుగా నరసాపురం వరకు పొడిగించారు. లాంఛనంగా ప్రారంభమైన ఈ రైలు, డిసెంబర్ 17 నుంచి ప్రయాణికులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. మంగళవారం మినహా వారానికి ఆరు రోజుల పాటు ఈ రైలు నడుస్తుంది.ఈ రైలు నరసాపురం నుంచి మధ్యాహ్నం 2:50 గంటలకు బయలుదేరి, రాత్రి 11:45 గంటలకు చెన్నై చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో చెన్నైలో ఉదయం 5:30 గంటలకు ప్రారంభమై, మధ్యాహ్నం 2:10 గంటలకు నరసాపురం వస్తుంది. మొత్తం 655 కిలోమీటర్ల దూరాన్ని సుమారు 9 గంటల్లో పూర్తి చేస్తుంది. ఈ రైలు భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట జంక్షన్లలో ఆగుతుంది.ఈ రైలులో ఏసీ చైర్ కార్ టికెట్ ధర రూ. 1,635 కాగా, ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ ధర రూ. 3,030గా అధికారులు నిర్ణయించారు. ఈ కొత్త సర్వీసుతో వాణిజ్య, వ్యాపార, పర్యాటక ప్రయాణాలు మరింత సులభతరం కానున్నాయి.

## మెడికల్ కాలేజీలపై జగన్‌వి దొంగ నాటకాలు: మంత్రి కొల్లు



**నమస్తే హైదరాబాద్ :** పేద వైద్య విద్యార్థులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మించాలని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. దీన్ని అడ్డుకునేందుకు జగన్ దొంగ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. సోమవారం అనకాపల్లిలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో.. ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్య కళాశాలల అంశంపై జగన్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు.

## ఆధునాతనంగా మోడల్ పోలీస్‌స్టేషన్‌ల నిర్మాణం: హోంమంత్రి అనిత

**నమస్తే హైదరాబాద్ :** చాలా మోడల్ పోలీస్టేషన్‌లను 2019కు ముందు తాము కట్టామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. గత జగన్ ప్రభుత్వంలో మోడల్ పోలీస్టేషన్‌లను పట్టించుకోలేదని విమర్శించారు. తమను అరెస్టు చేసి ఇదే మోడల్ పోలీస్టేషన్‌లో కూర్చోపెట్టారని చెప్పుకొచ్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ మోడల్ స్టేషన్లు నిర్మాణం చేస్తున్నామని పేర్కొన్నారు. కొత్త జిల్లాలు ఏర్పడిన వాటిలో కార్యాలయాలు లేవని.. నిర్మాణాలు చేయాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కళ్యాణం శివ శ్రీనివాస్ (కేకే) ఇవాళ(సోమవారం) బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా కళ్యాణం శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు హోంమంత్రి అనిత. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోంమంత్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జనసేన ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, చిల్లపల్లి శ్రీనివాసరావు, చక్రవర్తి, పలువురు కూటమి పార్టీల నేతలు, కార్పొరేషన్ ఎండీ రవిప్రకాష్, జనరల్ ఫైనాన్స్ మేనేజర్ సీతారామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు హోంమంత్రి అనిత. ఏపీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ తరపున అనేక మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు హోంమంత్రి అనిత.

ఎండీ రవి ప్రకాశ్ సారథ్యంలో పలు నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.509కోట్లతో అనేక భవనాల నిర్మాణం చేశామని వివరించారు. ఉమ్మడి ఏపీలో చర్లపల్లి, విశాఖపట్నం, జైళ్లు, ఆక్టోపస్, పోలీసు అకాడమీ వంటి అనేక నిర్మాణాలు ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ తరపున జరిగాయని తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అనేక మోడల్ పోలీస్టేషన్‌ల నిర్మాణం చేపట్టామని చెప్పుకొచ్చారు. రూ.179 కోట్లతో కొత్తగా నిర్మాణాలు చేపట్టబోతున్నామని వెల్లడించారు. రూ.412 కోట్లతో గ్రేహౌండ్స్ నిర్మాణం త్వరలోనే ప్రారంభం అవుతుందని వివరించారు హోంమంత్రి అనిత.

రూ.300 కోట్లతో ఏపీ పోలీసు అకాడమీ నిర్మాణం చేసుకోవాలని సూచించారు. నేడు పోలీసు హౌసింగ్ చేతిలో రూ. 1000 కోట్ల ప్రాజెక్టులు సిద్ధంగా ఉన్నాయిని తెలిపారు. ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ రవిప్రకాశ్‌ల సారథ్యంలో ఈ నిర్మాణాలు విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల ఆశీర్వాదంతో తమకు పదవులు లభించాయని చెప్పుకొచ్చారు. కళ్యాణం శివ శ్రీనివాస్ తన మార్కుతో మంచి ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

రెండేళ్లలో ఆ పనులు పూర్తి చేస్తాం: కళ్యాణం శ్రీనివాస్ గత జగన్ ప్రభుత్వంలో పోలీసు గృహ నిర్మాణ సంస్థలో ఎలాంటి నిర్మాణాలు చేయలేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర



పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శ్రీనివాస్ విమర్శించారు. తాను పోలీసు అవ్వాలని అనుకున్నా సాధ్యం కాలేదని చెప్పుకొచ్చారు. నేడు బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన అధినేతలకు ధన్యవాదాలు తెలిపారు. పోలీసు హౌసింగ్ తరపున రూ. 1200 కోట్ల నిర్మాణాలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. పదవి అంటే కుర్చీలో కూర్చోవడం కాదని... తన మార్కు పనితనం చూపిస్తానని వెల్లడించారు. హోంమంత్రి అనిత, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతో పాటు అధికారులు, సిబ్బంది సహకారంతో నిర్మాణాలు పూర్తి చేస్తామని చెప్పుకొచ్చారు. తనకు ఇచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకుని రెండేళ్లలో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. తప్పకుండా అన్ని ప్రాజెక్టులను నాణ్యతతో పూర్తి చేసి పోలీసు గృహ నిర్మాణ సంస్థకు మరింత పేరు తీసుకువస్తానని కళ్యాణం శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఈ ఏడాది ముప్పై ఫైర్ స్టేషన్ల నిర్మాణం చేపట్టాం: రవి ప్రకాశ్

పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ తరపున పోలీస్టేషన్ భవనాల నిర్మాణం, ఫైర్ స్టేషన్లు నిర్మాణం చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ రవి ప్రకాశ్ వ్యాఖ్యానించారు. ఈ ఏడాది ముప్పై ఫైర్ స్టేషన్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. చైర్మన్‌గా కళ్యాణం శ్రీనివాసరావు ఇవాళ బాధ్యతలు చేపట్టారని వివరించారు. అందరం కలిసి ఈ సంస్థ ద్వారా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని రవి ప్రకాశ్ పేర్కొన్నారు.

## నమ్మిన సిద్ధాంతాల కోసం నిలబడిన నేత వాజ్‌పేయి అని సత్యకుమార్ కితాబు



**నమస్తే హైదరాబాద్ :** అటల్ బిహారీ వాజ్‌పేయిని స్ఫూర్తిగా తీసుకునే ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని పాలిస్తున్నారని రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. వాజ్‌పేయి వ్యక్తిత్వం, ఆలోచనా విధానం, పాలనా శైలి మోదీకి ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. నెల్లూరులో జరిగిన 'అటల్ మోదీ సుపరిపాలన యాత్ర' సభలో ఆయన ప్రసంగించారు.వాజ్‌పేయిని అత్యంత దగ్గరగా చూసిన వ్యక్తిగా ఆయన గొప్పతనాన్ని అర్థంచేసుకున్నానని సత్యకుమార్ చెప్పారు. 63 ఏళ్ల పాటు ప్రతిపక్షంలో ఉన్నా, బీజేపీ కేవలం రెండు సీట్లు గెలిచినప్పుడు కూడా ఆయన మనోస్థైర్యం కోల్పోలేదని గుర్తుచేశారు.అపజయాన్ని అంగీకరించను, కాలం రాసిన రాతను మారుస్తా అంటూ కవిత్వం ద్వారా ఆయన చూపిన ఆత్మవిశ్వాసమే బీజేపీకి కొత్త మార్గం వేసిందని తెలిపారు.వాజ్‌పేయి వేసిన బాటలోనే నరేంద్ర మోదీ వంటి ఎందరో నేతలు ఎదిగారని, ఆయన స్ఫూర్తితోనే మోదీ దేశ ప్రధాని అయ్యారని సత్యకుమార్ కొనియాడారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లోనూ ప్రగతి సాధిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక విషయాన్ని వెల్లడించారు. త్వరలోనే విశాఖపట్నం, అమరావతిలో మెట్రో రైలు ప్రాజెక్టులు రానున్నాయని మంత్రి ప్రకటించారు.రక్షణ, వ్యవసాయ రంగాల్లో వాజ్‌పేయి నాటిన విత్తనాలే నేడు ఫలాలు ఇస్తున్నాయని చెప్పారు. పాకిస్థాన్‌కు స్నేహహస్తం అందించినా కుట్రలు ఆపకపోవడంతో సమరానికి సిద్ధమై బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. గడచిన 11 ఏళ్ల మోదీ పాలనలో దేశంలో ఒక్క పెద్ద ఉగ్రదాడి కూడా జరగలేదని, సర్జికల్ స్ట్రైక్స్‌తో భారత్ తన సత్తా చాటిందని తెలిపారు.

## కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ

**నమస్తే హైదరాబాద్ :** రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో చేపట్టనున్న పలు కీలక ఐటీ, నైపుణ్యాభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. లోకేశ్ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.ఈ సమావేశంలో రాష్ట్రంలో చేపట్టనున్న నైపుణ్య గణన కోసం ఏఐ టెక్నాలజీతో రూపొందించిన 'నైపుణ్యం పోర్టల్' గురించి లోకేశ్ కేంద్ర మంత్రికి వివరించారు. ఇప్పటికే మంగళగిరిలో పైలట్ ప్రాజెక్ట్ నిర్వహించామని, ఎదురైన సవాళ్లను అధిగమించేందుకు ఏఐ ఆధారిత ఇంటర్వ్యూ విధానాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే ఈ బృహత్ కార్యక్రమానికి కేంద్రం సహాయం అందించాలని కోరారు.అలాగే రాష్ట్రంలోని యువ పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు కేంద్రం అండగా నిలవాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఐటీ శాఖ పరిధిలోని '%వీవక్%స్టార్టప్ హబ్' ద్వారా మద్దతు అందించాలని కోరారు. ఇదే హబ్‌లో యానిమేషన్, ఏఆర్/వీఆర్ వంటి అత్యాధునిక టెక్నాలజీస్ కోసం ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు కూడా సహకరించాలని విన్నవించారు.ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలో



కృత్రిమ మేధ (ఏఐ) విస్తరణను వేగవంతం చేసేందుకు మద్దతివ్వాలని కోరారు. ఈ భేటీలో లోకేశ్ వెంట కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర ఎంపీలు కూడా ఉన్నారు.

## నేడు విచారణకు హాజరైన పీవీ సునీల్ కుమార్




**నమస్తే హైదరాబాద్ :** ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ గుంటూరు సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి నరసాపురం ఎంపీ, ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో హింసించారన్న కేసులో సునీల్ కుమార్ ప్రధాన నిందితుడిగా (ఏ1) ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసుకు సంబంధించి అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నారు. విజయనగరం ఎస్పీ దామోదర్ ఈ కేసులో విచారణాధికారిగా వ్యవహరిస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలోనే సునీల్ కుమార్ విచారణ కొనసాగుతోంది. తొలుత డిసెంబర్ 4న విచారణకు రావాలని గత నెల 26న అధికారులు సునీల్ కుమార్‌కు తొలిసారి నోటీసులు జారీ చేశారు. అయితే, కుటుంబ సభ్యుల అనారోగ్య కారణాల రీత్యా తనకు గడువు కావాలని ఆయన కోరారు.ఆయన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న అధికారులు, డిసెంబర్ 15న తప్పనిసరిగా హాజరుకావాలని ఈ నెల 6న రెండోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సునీల్ కుమార్ ఇవాళ గుంటూరు సీసీఎస్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి విచారణకు హాజరయ్యారు.

## మేడిపల్లి ఓసీపీ ప్రాంతంలో పులి సంచారం

**నమస్తే హైదరాబాద్ :** సింగరేణి మేడిపల్లి ఓపెన్‌కాస్టు ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తుందని, సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాళేశ్వరం జోన్ ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ ప్రభాకర్ సూచించారు. పులి సంచరిస్తున్న మేడిపల్లి ఓసీపీ గని ప్రాంతంలో మంగళవారం ఆయన పరిశీలించారు. ఫారెస్ట్ అధికారులకు పలు సూచనలు చేశారు. శనివారం సాయంత్రం శ్రీరాంపూర్ నుంచి గోదావరినది దాటి మేడిపల్లి ఓపెన్‌కాస్టు ప్రాంతంలో పెద్దపులి ప్రవేశించింది. ఆదివారం గ్రామస్థుల సమాచారంతోఫారెస్ట్ అధికారులు పులి అడుగులను గుర్తించారు. సోమవారం పులి సంచరించిన ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు ప్రభాకర్, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ శివయ్య, ఇతర అధికారులు పులి అడుగులను గుర్తించి సమీప గ్రామాలమైన మేడిపల్లి, లింగాపూర్, పాములపేట, మల్కాపూర్, విలేజీ రామగుండం, జనగామ, గంగానగర్ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. మేడిపల్లి ఓసీపీ మూసి వేసిన తరువాత ఆ ప్రాంతమంతా అడవిగా మారడంతో రెండు రోజులుగా పెద్దపులి ఆ ప్రాంతంలో సంచరిస్తుంది. మేడిపల్లి ఓసీపీ వెస్ట్ చెక్‌పోస్టు వద్ద ఫారెస్టు అధికారులు పులి అడుగులను గుర్తించారు. ఫారెస్ట్ ట్రాకర్స్ బృందం, సింగరేణి రెస్క్యూ బృందం పులి జాడ కోసం ప్రయత్నం చేసింది. రెండు సంవత్సరాల క్రితం జీడీకే 1ఇంక్లైన్ బొగ్గుగని ప్రాంతంలో చిరుత పులి సంచరించింది. ఇప్పుడు పెద్దపులి మేడిపల్లి ఓసీపీ ప్రాజెక్టులో తిరుగుతుండడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

# రైతులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్.. వారికి రూ.లక్ష.. పూర్తి వివరాలు ఇవే..



**నమస్తే హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్‌లో పంటలు సాగు చేసే కౌలు రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, ముఖ్యంగా వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేయాల్సిన దుస్థితిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా నిలవాలని నిర్ణయించింది. వ్యవసాయాన్ని ప్రోత్సహించే లక్ష్యం అర్హులైన కౌలు రైతులకు రూ.లక్ష వరకు రుణాలు ఇచ్చేందుకు అధికారికంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ చొరవ ద్వారా కౌలు రైతులను అప్పుల ఊబి నుంచి బయటపడేసి వారి సాగుకు పెట్టుబడి భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.

తక్కువ వడ్డీకి పీఏసీఎస్‌ల ద్వారా రుణాలు

ఈ రుణ సహాయ పథకాన్ని అమలు చేయడానికి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను కీలక సంస్థలుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందించడం వల్ల వారు ప్రైవేటు అప్పుల భారం నుంచి విముక్తి పొందగలరు. ప్రస్తుతం అధికారులు రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతుల వివరాలు సేకరించే ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ వివరాల సేకరణ పూర్తయిన వెంటనే అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ రుణాలు విత్తనాలు, ఎరువులు, కూలీ ఖర్చుల వంటి ముఖ్యమైన వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడతాయి.

అర్హతలు – ముఖ్య నిబంధనలు

రూ.లక్ష వరకు రుణం పొందడానికి కౌలు రైతులు తప్పనిసరిగా కొన్ని నిబంధనలు పాటించాలి. లబ్ధిదారులు సంబంధిత అధికారుల నుంచి జారీ చేయబడిన కౌలు పత్రాలు కలిగి ఉండాలి. అలాగే వారు సహకార సంఘం పరిధిలో నివాసం ఉంటూ ఆ సంఘంలో సభ్యత్వం కలిగి ఉండాలి. రుణానికి దరఖాస్తు చేసే రైతు కౌలు పత్రంలో చూపించిన సాగు భూమి ఎకరాకు తగ్గకుండా ఉండాలనే నిబంధన ఉంది. అయితే అసైన్డ్ భూములు సాగు చేస్తున్న కౌలు పత్రాలు ఉన్నవారు ఈ రుణానికి అర్హులు కారు. సొంత ఇల్లు ఉన్నవారికి ఈ రుణ మంజూరులో ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. రుణం పొందిన తేదీ నుంచి ఒక సంవత్సరం లోపు అసలు, వడ్డీని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

వ్యవసాయ రంగానికి ఊతం

కొత్త ప్రభుత్వం చేపట్టిన ఈ చర్య కేవలం కౌలు రైతులకు ఆర్థిక సహాయం అందించడమే కాకుండా రాష్ట్ర వ్యవసాయ రంగానికి ఒక బలమైన ఊతమిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. కౌలు రైతులు ధైర్యంగా పెట్టుబడి పెట్టి, పూర్తి స్థాయిలో పంటలు పండించడానికి ఈ రుణాలు ప్రేరణగా నిలుస్తాయి. ఈ ప్రాజెక్టు అమలు వివరాలపై, రుణాలు ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తాయనే దానిపై ప్రభుత్వం త్వరలోనే పూర్తి స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది.

# సరికొత్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన టీటీడీ..


**నమస్తే హైదరాబాద్ :** దేశంలోనే తొలిసారిగా ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణకు దిశానిర్దేశం చేసే దివ్య వృక్షాల ప్రాజెక్టుకు టీటీడీ శ్రీకారం చుట్టింది. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు వెల్లడించారు. ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం ప్రాచీన, ఆగమ శాస్త్రాలకు అనుగుణమైన హిందూ దేవాలయాల్లో అత్యంత ప్రాముఖ్యమైన ధ్వజస్తంభాల నిర్మాణానికి అవసరమైన దివ్య వృక్షాలను టీటీడీ స్వయంగా పెంచి, పరిరక్షించి వినియోగించడమేనన్నారు. సీఎం చంద్రబాబు దూరదృష్టితో రూపొందించిన తిరుమల అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు ఉంటుందన్నారు. సంప్రదాయాల పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే బాధ్యతాయుత పాలనకు ఇది నిదర్శనమని బీ.ఆర్ నాయుడు అన్నారు.

ధ్వజస్తంభానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యం

ధ్వజస్తంభం కేవలం నిర్మాణాత్మక అంశం మాత్రమే కాదు. అది భౌతిక లోకానికి, దైవ లోకానికి మధ్య ఉన్న శాశ్వత బంధానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆలయ ప్రాంగణంలో నిటారుగా నిలిచి ఉండే ధ్వజస్తంభం భక్తి, పవిత్రత, దైవ సన్నిధిని ప్రతిబింబిస్తుంది. ఆగమశాస్త్రాల ప్రకారం ధ్వజస్తంభం నిటారుగా పెరిగిన ఒకే చెట్టుకు చెందిన పవిత్ర వృక్ష కాండంతో తయారు చేయాలి. ఆ వృక్షాన్ని ఆధ్యాత్మిక, జ్యోతిష్య, విధి విధానాలకు అనుగుణంగా ఎంపిక చేసి, ఏళ్ల తరబడి సంరక్షించి, ఆపై శాస్త్రోక్తంగా కైంకర్యాలు నిర్వహించిన అనంతరం వినియోగిస్తారు.

ధ్వజస్తంభాల కోసం ఉపయోగించే పవిత్ర వృక్షాలు

ఆగమ సంప్రదాయాల ప్రకారం ధ్వజస్తంభాల తయారీలో సాధారణంగా టేకు, ఏగిశా (ఇండియన్ కినో), టెర్మినేలియా, షోరియా జాతికి చెందిన వృక్షాలను వినియోగిస్తారు. ఇవి బలంగా, దీర్ఘకాలికంగా నిటారుగా పెరిగే స్వభావం కలిగి ఉండటం వల్ల ధ్వజస్తంభం అవసరాలకు అనుకూలంగా ఉంటాయి. పరిపక్వత చెందిన తర్వాత ఆ వృక్షాన్ని శాస్త్రోక్తంగా పూజించి, ఆపై ధ్వజస్తంభంగా రూపకల్పన చేస్తారు. అనంతరం దానిని కవచంతో కప్పి, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం లాంటి అత్యంత పవిత్ర ఆలయాల్లో స్వర్ణ కవచంతో అలంకరిస్తారు. ఇక రాజగోపురం, గర్భగుడి విమానం మధ్య పవిత్ర ప్రదేశంలో ప్రతిష్ఠించే ధ్వజస్తంభంపై గరుడ ధ్వజాన్ని ఆవిష్కరిస్తారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల ప్రారంభాన్ని ప్రకటించే ఈ ధ్వజారోహణం



సమస్త లోకాల్లోని దేవతలను ఆహ్వానించే శుభ సూచకంగా నిలుస్తుంది.

దివ్య వృక్షాల పెంపకంపై టీటీడీ దూరదృష్టిఇక దేశవ్యాప్తంగా 60కి పైగా ఆలయాలను టీటీడీ నిర్వహిస్తోంది. భవిష్యత్తులో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయాలను ఆగమ నియమాలకు అనుగుణంగా నిర్మించే బాధ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ దివ్య వృక్షాల ప్రాజెక్టును అత్యంత దూరదృష్టితో ప్రారంభిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా కాలక్రమేణ మార్పు అవసరమైన ధ్వజస్తంభాల స్థానంలో శాస్త్రోక్తంగా కొత్త ధ్వజస్తంభాలను ఏర్పాటు చేస్తారు. భవిష్యత్తులో టీటీడీ నిర్మించనున్న ఆలయాలకు అవసరమైన ధ్వజస్తంభాల కోసం పవిత్రమైన కలపను ముందుగానే సిద్ధం చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. దివ్య వృక్షాల ప్రాజెక్టు వివరాలు ఇవేప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో భాగంగా సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో దివ్య వృక్షాల ప్రాజెక్టు కోసం కేటాయించాలని టీటీడీ బోర్డు ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు అమలుతో, ధ్వజస్తంభాల కోసం అవసరమైన దివ్య వృక్షాలను స్వయంగా పెంచే తొలి దేవాలయ సంస్థగా టీటీడీ దేశంలో చరిత్ర సృష్టించనుంది. దీని ద్వారా ఆగమ శుద్ధి, ఆధ్యాత్మిక పవిత్రత, పర్యావరణ బాధ్యత, సంస్థాగత స్వావలంబనను తరతరాలకు కొనసాగించగలుగుతామని టీటీడీ స్పష్టం చేసింది.

# ఏపీలో రోడ్డు ప్రమాదాలకు చెక్.. సిక్స్‌లేన్‌తో ఊరట




**నమస్తే హైదరాబాద్ :** అనంతపురం జిల్లా కేంద్రంలోని తపోవనం సర్కిల్‌లో వై జంక్షన్ రాబోతోంది. ప్రస్తుతం 44వ జాతీయ రహదారి.. కర్నూలు నుంచి అనంతపురం మీదుగా కర్ణాటక సరిహద్దులోని కొడికొండ చెక్‌పోస్టు వరకు 261 కిలోమీటర్ల పొడవునా ఫోర్‌లేన్‌గా ఉంది. ఆ స్థానంలో సిక్స్‌లేన్‌గా విస్తరణ పనులు చేపట్టడానికి రంగం సిద్ధం చేశారు. ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణ సమయంలోనే సిక్స్‌లేన్‌కు అనుగుణంగా స్థలసేకరణ దాదాపు పూర్తి చేశారు. దీంతో ప్రస్తుతం స్థల సేకరణ సమస్య తలేత్తే అవకాశం లేదు. పనులు సకాలంలో పూర్తి చేయడానికి చాలా అవకాశం ఉంటుంది. అందుకు అనుగుణంగా ఇప్పటికే ఎక్కడ ఎక్కడ ఏమి చేయాలన్నది డీపీఆర్ (డీటేల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) కూడా సిద్ధం చేశారు. కర్ణాటక సరిహద్దులోని కొడికొండ చెక్‌పోస్టు వరకు నాలుగు అతి పెద్ద ఫ్లైవోవర్స్‌తోపాటు మరో 20 అండర్ పాస్ బ్రిడ్జిలు ఏర్పాటు చేసేలా డీపీఆర్ సిద్ధం చేశారు. అందులో భాగంగా జిల్లా కేంద్రంలోని తపోవనం సర్కిల్‌లో ఫ్లైవోవర్ నిర్మించడం ద్వారా అక్కడ వై జంక్షన్ ఏర్పాటు కానున్నట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. అదే తరహాలో రాప్తాడు వద్ద మరో వై జంక్షన్ ఫ్లైవోవర్ బ్రిడ్జి, సోమందేపల్లి, చిలమత్తూరు ప్రాంతంతో కలిపి మొత్తం నాలుగు ఫ్లైవోవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నట్లు డీపీఆర్‌లో పేర్కొన్నారు. 261 కిలో మీటర్ల పొడవుతో 6 లేన్ల రోడ్డుగా విస్తరణ చేయనున్నారు.

రోడ్డు ప్రమాదాలకు చెక్

ప్రస్తుతం జాతీయ రహదారిలోని పలుచోట్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. తపోవనం, రాప్తాడు సర్కిళ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. సిక్స్‌లేన్ రహదారితో పాటు ఫ్లైవోవర్ల నిర్మాణంతో రోడ్డు ప్రమాదాలకు చెక్ పడవచ్చని అధికారులు భావిస్తున్నారు. రాప్తాడు వై జంక్షన్‌కు రూ.65 కోట్లు, సోమందేపల్లి వద్ద ఫ్లైవోవర్ బ్రిడ్జికి రూ.75 కోట్లు, చిలమత్తూరు మండలంలో ఫ్లైవోవర్‌కు రూ.65 కోట్లు మంజూరయినట్లు తెలుస్తోంది.

వీటికి సంబంధించిన పనులు త్వరలోనే ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఒక్కో బ్రిడ్జి 4.22 కిలో మీటర్ల పొడవుతో ఉంటుంది. ఈ పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం కావడతో పాటు రోడ్డు ప్రమాదాలు నియంత్రణ అవుతాయి. మొదట ఫ్లైవోవర్స్, అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణాలు పూర్తి చేసే అవకాశం ఉన్నట్లు అధికార యంత్రాంగం చెబుతోంది.

మొదట బ్రిడ్జిలు నిర్మిస్తాం

ప్రస్తుతం ఫోర్‌లేన్‌గా ఉన్న జాతీయ రహదారిని సిక్స్‌లేన్ విస్తరణకు సంబంధించి కన్సల్టెన్సీ ద్వారా డీపీఆర్ సిద్ధం చేశాం. అందుకు అనుగుణంగా ఎక్కడ ఏమి చేయాలన్నది డీపీఆర్‌లో పొందుపరిచారు. మొదట బ్రిడ్జిల నిర్మాణం చేపట్టే అవకాశం ఉంది. వాటిని పూర్తి చేస్తే మిగిలిన రోడ్డు విస్తరణ పనులకు పెద్ద సమయం పట్టదు. ప్రభుత్వం నుంచి వచ్చే ఉత్తర్వుల మేరకు కార్యాచరణ చేపడతాం.

# పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్రం: మంత్రి టీజీ భరత్



**నమస్తే హైదరాబాద్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా చిన్న అమ్మవారి శాల వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి మంత్రి టీజీ భరత్ పాలాభిషేకం చేశారు. ఆపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు త్యాగం వల్లే ఆనాడు ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడటానికి పొట్టి శ్రీరాములే కారణమని తెలిపారు. పొట్టి శ్రీరాములు ఒక కులానికి చెందిన వ్యక్తి కాదని.. ప్రజలందరి వ్యక్తి అని అన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధిస్తామని పొట్టి శ్రీరాములు నిరూపించారని చెప్పారు. అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతి వనం నిర్మాణానికి కూటమి ప్రభుత్వం 6.8 ఎకరాలు కేటాయించిందన్నారు. స్మృతివనం శంకుస్థాపన రోజు మొదటి దాతగా 1 కోటి రూపాయలు తమ టీజీవీ సంస్థల నుండి విరాళం ఇచ్చినట్లు వెల్లడించారు. కర్నూలులో పొట్టి శ్రీరాములు విగ్రహం ఉన్న కూడలిలో అవసరమైన అభివృద్ధి పనులు చేస్తామని స్పష్టం చేశారు. పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతి కార్యక్రమాలు చిన్న అమ్మవారి శాల వద్ద ఉన్న ఆయన విగ్రహం వద్దనే నిర్వహిస్తామని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.

# చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య లేఖ



**నమస్తే హైదరాబాద్ :** గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులను ఎన్నికల బూత్ స్థాయి అధికారి విధుల నుంచి తప్పించాలని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఈ మేరకు ఆయన సీఎం చంద్రబాబుకు ఒక లేఖ రాశారు. సచివాలయం ఉద్యోగులు అదనపు పనిభారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.సచివాలయ ఉద్యోగులు ఇప్పటికే 16 రకాల సర్వేలతో పాటు ఇతర పనులతో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని ఈశ్వరయ్య తన లేఖలో పేర్కొన్నారు. ఈ పని భారానికి అదనంగా ఎన్నికల విధులు కూడా తోడవడంతో వారు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు నెలల్లోనే పని ఒత్తిడి కారణంగా నలుగురు సచివాలయ ఉద్యోగులు మరణించడం అత్యంత బాధాకరమని ఆయన తెలిపారు.ఇదే సమయంలో కర్నూలు జిల్లాలో 600 మందికి పైగా సచివాలయ ఉద్యోగులకు అధికారులు షోకాజు నోటీసులు జారీ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సచివాలయ ఉద్యోగులపై పని భారం తగ్గించాలని, వారిని బీఎల్‌వో విధుల నుంచి మినహాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు.

# శబరిమలలో పోటెత్తిన భక్తులు

**నమస్తే హైదరాబాద్ :** శబరిమల అయ్యప్ప స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. ప్రస్తుత మండల యాత్రా సీజన్‌లో స్వామివారిని దర్శించుకున్న యాత్రికుల సంఖ్య ఇప్పటికే 25 లక్షలు దాటింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల అని అధికారులు తెలిపారు. రద్దీ పెరిగినప్పటికీ, పటిష్ఠమైన ఏర్పాట్ల కారణంగా దర్శనాలు సజావుగా సాగుతున్నాయని శబరిమల చీఫ్ పోలీస్ కోఆర్డినేటర్, ఏడీజీపీ ఎస్. శ్రీజిత్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.గతేడాది ఈ సమయానికి సుమారు 21 లక్షల మంది భక్తులు రాగా, ఈసారి ఆ సంఖ్య 25 లక్షలు దాటిందని ఆయన తెలిపారు. యాత్ర ప్రారంభమైన తొలి రోజుల్లో అధిక రద్దీ కనిపించినా, సకాలంలో తీసుకున్న చర్యలతో పరిస్థితిని అదుపులోకి తెచ్చామన్నారు. వర్చువల్ క్యూ పాసులలో కేటాయించిన తేదీల్లో కాకుండా వేరే రోజుల్లో భక్తులు రావడమే ప్రాథమికంగా రద్దీకి కారణమని ఆయన స్పష్టం చేశారు. కేటాయించిన తేదీల్లోనే వస్తే అందరికీ సౌకర్యవంతంగా దర్శనం లభిస్తుందని సూచించారు.



# హోరాహోరీ పోరు.. ఒక్క ఓటుతో సర్పంచ్ పీఠం!

**నమస్తే హైదరాబాద్ :** పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించడం అభ్యర్థులకు ఎంత ప్రతిష్టాత్మకమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈసారి ఎన్నికల్లో విజేతల తీరు అత్యంత ఉత్కంఠభరితంగా, హోరాహోరీగా సాగింది. కొన్నిచోట్ల అభ్యర్థుల గెలుపోటములు కేవలం కొద్ది ఓట్ల తేడాతోనే నిర్ణయమయ్యాయి. అయితే, మరీ ముఖ్యంగా ఒక్కే ఒక్క ఓటు తేడాతో విజయం సాధించిన అభ్యర్థుల గురించి ప్రత్యేకంగా చర్చ జరుగుతోంది. ఇది ఓటర్లు తమ ఒక్క ఓటు విలువను ఎంత పక్కాగా ఉపయోగించుకున్నారో, అభ్యర్థులు తమ గెలుపు కోసం ఎంత చివరి వరకు పోరాడారో నిరూపిస్తోంది. ఓటరు చైతన్యానికి, ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పతనానికి ఇది నిలువెత్తు నిదర్శనం.ఈ ఒక్క ఓటు తేడా విజయాల్లో కరీంనగర్ జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ఈ జిల్లాలో ఏకంగా ఐదుగురు అభ్యర్థులు సర్పంచ్ పీఠాన్ని కేవలం ఒక్క ఓటు మెజారిటీతోనే దక్కించుకున్నారు. కొత్తపల్లిలో శోభారాణి అత్యంత తక్కువ తేడాతో విజయం సాధించారు. అదేవిధంగా, పెద్దూరుపల్లిలో రామడుగు హరీశ్ కూడా ఒక్క ఓటుతోనే సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. మహాత్మనగర్‌లో పొన్నాల సంపత్, ముంజంపల్లిలో నందగిరి కనక లక్ష్మి, అంబల్ పూర్‌లో వెంకటేశ్ కూడా తమ అదృష్టాన్ని ఒక్క ఓటుతో పరీక్షించుకుని, చివరికి విజయ తీరాన్ని చేరుకున్నారు. ఈ ఐదుగురు అభ్యర్థులు తమ రాజకీయ భవిష్యత్తును కేవలం ఒక్క ఓటుతోనే నిర్ణయించుకోవడం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

కరీంనగర్ జిల్లాలాగే, రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఒక్క ఓటు తేడా విజయాలు నమోదయ్యాయి. వరంగల్ (డి) జిల్లాలోని ఆశాలపల్లి గ్రామంలో కూడా సర్పంచ్ పదవి కోసం తీవ్రమైన పోటీ జరిగింది. చివరకు, కొంగర మల్లమ్మ ఒక్క ఓటు తేడాతో విజేతగా నిలిచారు. అలాగే, నల్గొండ (డి) జిల్లాలోని ధన్‌సింగ్ తండాలో కూడా ఇదే తరహా ఫలితం వెలువడింది. ఇక్కడ ధనావత్ కూడా కేవలం ఒక్క ఓటు మెజారిటీతో సర్పంచ్ పదవిని కైవసం చేసుకున్నారు. ఈ అభ్యర్థులు ఎంతో శ్రమించి, ప్రతి ఓటరును కలిసి తమకు ఓటు వేయాల్సిందిగా కోరుకోవడంలో విజయం సాధించారు. తమ ప్రత్యర్థి కన్నా ఒక్క ఓటు ఎక్కువ సాధించడం ద్వారానే వీరు ప్రజాప్రతినిధులు కాగలిగారు. ఈ తరహా ఫలితాలు రావడం ఎన్నికల వ్యవస్థలో ఓటు ఎంతటి కీలక పాత్ర పోషిస్తుందో స్పష్టం చేస్తున్నాయి. కొన్నిసార్లు ఒక ఓటు వేయకపోవడం వల్ల కూడా అభ్యర్థుల గెలుపోటములు తారుమారు కావచ్చు.

# ఉప్పాడ మత్స్యకారుల జీవనోపాధి పెంచేందుకు,,, తమిళనాడు, కేరళలో ట్రైనింగ్



**నమస్తే హైదరాబాద్ :** ఉప్పాడ తీర ప్రాంత సమస్యపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఉప్పాడ తీర ప్రాంతంలోని మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపర్చేలా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఓ సరికొత్త ఆలోచన చేశారు. ఇందుకోసం 100 రోజులు ప్రణాళిక ప్రకటించారు. ఈ ప్రణాళిక ప్రకారం ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారులకు అధ్యయనం, అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా.. ఉప్పాడ మత్స్యకారులకు తమిళనాడు. కేరళ రాష్ట్రాలలో ట్రైనింగ్ అందించారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలు అనుసరిస్తున్న టెక్నాలజీ సాయంతో.. ఉప్పాడ, కాకినాడ తీర ప్రాంత మత్స్యకారులకు వసతులు కల్పించేందుకు ఎలాంటి అవకాశాలు ఉన్నాయనే దానిపై మత్స్యశాఖ అధికారులు అధ్యయనం జరుపుతున్నారు.అందులో భాగంగా మత్స్య సంపదతో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అవసరమైన అధునాతన పద్దతులపై అధ్యయనం చేసేందుకు ఉప్పాడ మత్స్యకారులను తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు పంపించారు. డిసెంబర్ నెల 8వ తేదీన 60 మంది మత్స్యకారులు.. రెండు బృందాలుగా అక్కడకు వెళ్లారు. స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించడం ఎలా అనే అంశం మీద రెండు రాష్ట్రాల్లో మూడు రోజుల పాటు ట్రెనింగ్ తీసుకున్నారు. అధునాతన కేజ్ కల్చర్, రిఫ్ కల్చర్, మార్కెటింగ్ వ్యవస్థల ఏర్పాటుపై శిక్షణ తీసుకున్నారు. అలాగే హార్బర్ల సందర్శన, హ్యాచరీల్లో చేపల గుడ్లు పొదిగించడం, వలల తయారీ తదితర అంశాల్లో వీరికి ట్రైనింగ్ ఇప్పించారు.

తమిళనాడుకు వెళ్లిన మత్స్యకారులకు.. చెన్నైలోని మండపం వద్ద ఉన్న సి.ఎస్.ఎం.సి.ఆర్.ఐలో కృత్రిమ, సహజ పద్దతుల్లో సాగు చేస్తున్న కేజ్ కల్చర్, రిఫ్ కల్చర్ గురించి శిక్షణ తరగతులు నిర్వహించారు. సముద్ర వనరుల దీర్ఘకాలిక సంరక్షణకు అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలను తెలియజేశారు. చేపల అమ్మకం, కోల్డ్ స్టోరేజ్ వ్యవస్థ, మత్స్య సంపద గ్రేడింగ్, వేలం నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ, సప్లై చైన్ వంటి అత్యాధునిక సదుపాయాలపై అవగాహన కల్పించారు. ఇక కేరళ వెళ్లిన బృందానికి చేపలవేటలో సాంకేతిక మేళవింపు, స్థిరమైన ఆదాయార్జన, లాభదాయక విధానాలు అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ పర్యటనల ద్వారా మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అమలు చేస్తున్న అధునాతన విధానాలు, లాభాలపై ఉప్పాడ మత్స్యకారులకు అవగాహన కలిగిందని అధికారులు చెప్తున్నారు.

# ఉపాధి హామీకి మంగళం.. కొత్త చట్టంతో 125 రోజులకు పెరగనున్న పని దినాలు!

**నమస్తే హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా గ్రామీణ పేదలకు ప్రధాన జీవనాధారంగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడానికి రంగం సిద్ధం చేసింది. దీని స్థానంలో 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్)' పేరుతో ఒక సరికొత్త చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో సంబంధిత బిల్లును ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు ముమ్మరం చేసింది. ఇందుకు సంబంధించిన కీలకమైన బిల్లు ప్రతులను ఈరోజే లోక్‌సభలో సభ్యులకు పంపిణీ చేసినట్లు సమాచారం.

ఈ కొత్త చట్టం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు మరింత మేలు చేకూర్చేలా కేంద్రం ప్రణాళికలు రచిస్తోంది. ముఖ్యంగా నైపుణ్యం లేని కార్మికులకు ప్రస్తుతం కల్పిస్తున్న 100 రోజుల పని దినాలను, కొత్త చట్టం కింద 125 రోజులకు పెంచనున్నట్లు తెలుస్తోంది. పెరిగిన ధరలు మరియు గ్రామీణ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, అదనపు పని దినాలు కల్పించడం ద్వారా పేద కుటుంబాలకు మరింత ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పెంపుదల గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఈ బిల్లును ఆమోదించుకునే దిశగా కేంద్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. లోక్‌సభ సభ్యులకు ఇప్పటికే ముసాయిదా పత్రాలు ఇవ్వడంతో, రాబోయే రోజుల్లో సభలో దీనిపై విస్తృత చర్చ జరిగే అవకాశం ఉంది. పాత చట్టం స్థానంలో వస్తున్న ఈ 'వికసిత్ భారత్' మిషన్ విధివిధానాలు ఎలా ఉండబోతున్నాయి, నిధుల కేటాయింపులో ఎలాంటి మార్పులు ఉంటాయి అనే అంశాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. విపక్షాలు ఈ భారీ మార్పును



ఏ విధంగా స్వీకరిస్తాయి, దీనిపై ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేస్తాయన్నది వేచి చూడాలి. దశాబ్ద కాలంగా గ్రామీణ భారతావని ముఖచిత్రంగా ఉన్న ఉపాధి హామీ పథకం పేరు మరియు స్వభావం మారనుండటం ఒక చారిత్రక పరిణామంగా చెప్పుకోవచ్చు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన భారత్ గా మార్చాలన్న లక్ష్యంతోనే ఈ కొత్త చట్టాన్ని రూపొందించినట్లు ప్రభుత్వం చెబుతోంది. కేవలం పేరు మార్పు మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో కూలీలకు వేతనాల చెల్లింపులు మరియు పనుల కల్పనలో పారదర్శకత పెంచేందుకు ఈ కొత్త మిషన్ దోహదపడుతుందని అధికారులు ఆశిస్తున్నారు. త్వరలోనే దీనిపై పూర్తి స్థాయి గెజిట్ నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది.

# ఢిల్లీ సర్కార్ సంచలన నిర్ణయం.. తందూరీ వంటకాలపై నిషేధం




**నమస్తే హైదరాబాద్ :** ప్రస్తుత శీతాకాలంలో దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకూ దారుణంగా పడిపోతున్న నేపథ్యంలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఢిల్లీలో కాలుష్యానికి అడ్డుకట్ట వేసేందుకు రేఖా గుప్తా నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంతోపాటు.. కేంద్ర ప్రభుత్వం అనేక కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాయి. అయినప్పటికీ.. గాలి నాణ్యత మాత్రం మెరుగుపడటం లేదు. ఈ నేపథ్యంలో రోజురోజుకూ మరిన్ని కఠినమైన ఆంక్షలను ప్రవేశపెడుతున్నారు. ఢిల్లీలో కాలుష్యం పెరుగుతుండటంతో డిసెంబర్ 9వ తేదీన బొగ్గు, కట్టెలతో తయారు చేసే బహిరంగ తందూరీలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది.

హెూటళ్లు, రెస్టారెంట్లు, బహిరంగ తినుబండారాల్లో బొగ్గు, కట్టెలతో పనిచేసే ఓపెన్ తందూర్‌లను పూర్తిగా నిషేధిస్తూ ఢిల్లీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నిషేధం అమలులోకి రావడంతో.. ఆయా హెూటళ్లు ఎప్పటి నుంచో తయారు చేస్తున్న వంటకాల తయారీ కోసం ప్రత్యామ్నాయ వంట పద్ధతుల (ఎలక్ట్రిక్ లేదా గ్యాస్ తందూర్‌లు) వైపు అడుగులు వేస్తున్నాయి.

ఈ నిర్ణయంతో ఢిల్లీలోని హెూటళ్లు, రెస్టారెంట్లు కీలక నిర్ణయం తీసుకుంటున్నాయి. లోధి కాలనీలోని ఎంఐ ఫుడ్ సెంటర్‌లో.. తందూరీ వంటకాలే ప్రధానంగా విక్రయిస్తారు. ఇప్పుడు తందూరీపై నిషేధం విధిస్తే.. తాము హెూటల్ మెనూ మొత్తం మార్చాల్సిందేనని నిర్వాహకులు తెలిపారు. కస్టమర్‌లు ఆ పొగ రుచిని ఆశించే తమ హెూటల్‌కు వస్తారని.. రాత్రికి రాత్రే దాన్ని మార్చేయడం అంత సులభం కాదని పేర్కొన్నారు.మాల్వియా నగర్‌లోని ఒబెరాయ్ దాబా మాత్రం.. ఢిల్లీ నగరంలో కలుషితమైన గాలి పెరిగిపోతున్న దృష్ట్యా ఈ మార్పు చాలా అవసరమని పేర్కొంది. ఈ నిర్ణయం కష్టమే అయినప్పటికీ.. చాలా ముఖ్యమని తెలిపింది. ఈ సమస్య పరిష్కారం కనుగొంటామని.. ఒబెరాయ్ దాబా ఓనర్ అశోక్ అన్నారు. బొగ్గు వాడకాన్ని ఆపడం వల్ల ఢిల్లీ గాలి కొంచెమైనా మెరుగుపడితే.. ఢిల్లీవాసులుగా, వ్యాపారులుగా తామే సహకరించాలని పేర్కొన్నారు. బొగ్గు, కట్టెలకు బదులు.. ప్రత్యామ్నాయ గ్రిల్స్‌తో ప్రయోగాలు చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల కొన్ని వంటకాల రుచి కొద్దిగా మారవచ్చని.. అది పెద్ద సమస్య కాదని చెప్పారు.తందూరీ వంటకాలపై నిషేధం విధించడం.. ఢిల్లీలోని ఇరుకైన ప్రాంతాల్లో నడిచే చిన్న చిన్న హెూటళ్లకు ఇది పెద్ద దెబ్బగా మారుతుందని వారు పేర్కొంటున్నారు. జామా మసీద్ సమీపంలోని అస్లాం కిచెన్‌లో.. తందూరీ వంటకాలను తమ మెనూ నుంచి పూర్తిగా తొలగించాల్సి వస్తుందేమోనని దాని ఓనర్ షాదాబ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని హెూటళ్లు మెనూ మార్పులకు బదులుగా.. తందూరీ బట్టీల డిజైన్‌లో మార్పులు చేయాలని భావిస్తున్నాయి. తమ వంట విధానాన్ని మార్చేందుకు కట్టెలు, బొగ్గుతో ఉపయోగించే తందూరీ బట్టీ కాకుండా.. ఎలక్ట్రిక్ లేదా గ్యాస్ తందూర్‌ను ఉపయోగించే విధంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నామని నార్త్ ఢిల్లీలోని ఒక ప్రముఖ డైనింగ్ మేనేజర్ విశేష్ నిజావాన్ చెప్పారు. ఇది తమకు అదనపు ఖర్చు, ఫుడ్ రుచిలో మార్పు తీసుకువస్తుందని.. కానీ తమకు అంతకుమించి వేరే మార్గం లేదని వివరించారు.

# పొట్టి శ్రీరాములు త్యాగం అందరికీ స్ఫూర్తి: సీఎం చంద్రబాబు



**నమస్తే హైదరాబాద్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నివాళులర్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం స్పందిస్తూ.. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే దృఢ నిశ్చయంతో పోరాడిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ప్రాణాలను కూడా లెక్క చేయకుండా ప్రత్యేక రాష్ట్రం పోరాడారని అన్నారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న ధీరోదాత్తుడు పొట్టి శ్రీరాములు అని సీఎం తెలిపారు. ఆ మహనీయుడు ప్రాణ త్యాగ ఫలమే ఈ రోజు మనకున్న భాషాప్రయుక్త రాష్ట్రాలు అని డిప్యూటీ సీఎం పవన్ అన్నారు.

చంద్రబాబు ట్వీట్..

'అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా వారికి ఘన నివాళి అర్పిస్తున్నాను. మహాత్మా గాంధీ సిద్ధాంతాల ప్రభావంతో భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని ఉప్పు సత్యాగ్రహంలో, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ధీరోదాత్తుడు ఆయన. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే దృఢ నిశ్చయంతో పోరాడి లక్ష్యం సాధించిన మహనీయుడు ఆయన. తన ప్రాణాలను కూడా లెక్కచేయని ఆయన త్యాగం మనలో స్ఫూర్తి నింపాలి. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు తన ప్రాణత్యాగంతో నాంది పలికిన ఆ మహనీయునికి శిరస్సు వంచి నమస్కరిస్తూ మరొక్కమారు నివాళి అర్పిస్తున్నాను' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.



**ఆ మహనీయుని ప్రాణ త్యాగ ఫలమే: డిప్యూటీ సీఎం పవన్**

తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే సంకల్పంతో దీక్ష చేపట్టి ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా అమరజీవికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నివాళులర్పించారు. ఆ మహనీయుని ప్రాణ త్యాగ ఫలమే ఈ రోజు మనకున్న భాషాప్రయుక్త రాష్ట్రాలని తెలిపారు. మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడిచి సమసమాజ స్థాపన కోసం తపించారని తెలిపారు. గాంధీజీతో పొట్టి శ్రీరాములుకు ఉన్న అనుబంధాన్ని ఆంధ్ర ఉద్యమం గురించి ప్రచురితమైన అధ్యయన పత్రాల్లో పేర్కొన్నారని చెప్పారు. లక్ష్య సాధన కోసం అమరజీవి చేసిన దీక్షను భావితరాలు తెలుసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ వెల్లడించారు.

# జీవీఎంసీకి ప్రతిష్టాత్మక అవార్డులు

**నమస్తే హైదరాబాద్ :** 47వ ఆల్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్‌లో జీవీఎంసీకి మూడు ప్రతిష్టాత్మక పీఆర్ఎస్ఐ – 2025 జాతీయ అవార్డులు వచ్చాయి. డెహ్రాడూన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డులను అందజేశారు. జీవీఎంసీ తరపున అదనపు కమిషనర్ డీవీ రమణ మూర్తి, పౌర సంబంధాల అధికారి ఎన్. నాగేశ్వరరావు ఈ అవార్డులను స్వీకరించారు. జీవీఎంసీకి జాతీయ అవార్డులు రావడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.




# పదోన్నతి తీర్పు అమలు చేస్తాం!

## ప్రస్తుతం మంత్రివర్గ ఉపసంఘం చూస్తోంది
## పరిష్కార మార్గాన్ని మంత్రులు పరిశీలిస్తున్నారు
## 4 వారాల టైమ్ ఇవ్వండి: హైకోర్టుకు ఏజీ వినతి


**నమస్తే హైదరాబాద్ :** ఉద్యోగులకు పదోన్నతి కల్పించే విషయంపై 2018లో ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేస్తామని, అయితే.. దీనికి మరో నాలుగువారాల గడువు ఇవ్వాలని అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ సోమవారం హైకోర్టుకు నివేదించారు. ఇది రెండు గ్రూపుల మధ్య వ్యహారమని, పరిష్కారాన్ని కనుగొనేందుకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం(జీవోఎం) ఏర్పాటు చేసిందని, ఈ వ్యవహారం తుది దశలో ఉందని తెలిపారు. గతంలో కార్యదర్శులతో కూడిన కమిటీ ఇచ్చిన నివేదికలో పదోన్నతులు కల్పించేందుకు ఎన్ని సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించాలనే విషయంపై సరైన లెక్క లేదని, ఆ అంశాన్ని తేల్చాల్సి ఉందన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్. రఘునందనరావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌లతో కూడిన ధర్మాసనం విచారణను జనవరి 20కి వాయిదా వేసింది. తదుపరి విచారణకు సీఎస్, సాంఘిక సంక్షేమశాఖ



ముఖ్యకార్యదర్శి హాజరుకు మినహాయింపు ఇచ్చింది. పదోన్నతుల్లో తమకు అన్యాయం జరిగిందంటూ పలువురు ఉద్యోగులు 2016, 2017లో ఉమ్మడి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన కోర్టు పదోన్నతుల్లో అన్ని వర్గాల ఉద్యోగులకు తగినంత ప్రాతినిధ్యం ఉందా? లేదా? అనే విషయాన్ని కనీస అధ్యయనం చేయకుండా రిజర్వేషన్ కల్పించారని తప్పుబట్టింది. బాధిత ఉద్యోగుల వాదనలు విని రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కి అనుగుణంగా ప్రతి ఉద్యోగి పదోన్నతిని సమీక్షించాలని 2018, డిసెంబరు 11న తీర్పు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు అమలుకాకపోవడంతో 'ది సెక్రెటేరియట్ బీసీ అండ్ ఓసీ ఎంప్లాయీస్' అసోసియేషన్, మరికొందరు ఉద్యోగులు హైకోర్టులో ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లు ఇటీవల విచారణకు రాగా పదోన్నతుల కల్పన విషయంలో జాప్యంపై వివరణ ఇచ్చేందుకు నేరుగా తమ ముందు హాజరుకావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.ఎం. నాయక్‌ను ఆదేశించింది. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర సీఎస్, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి సోమవారం ధర్మాసనం ముందు హాజరయ్యారు. విచారణ ప్రారంభమైన వెంటనే ఏజీ స్పందిస్తూ.. ఉత్తర్వుల అమలుకు చివరి అవకాశంగా మరో 4 వారాల సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఇది రెండు గ్రూపుల మధ్య వ్యవహారమన్నారు.

అలా అయితేనే గడువు ఉద్యోగుల తరఫు న్యాయవాదులు స్పందిస్తూ... సచివాలయ ఉద్యోగుల పదోన్నతి విషయంలో మాత్రమే ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలోని 33శాఖల్లో ఉన్న ఉద్యోగుల పదోన్నతులకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్టయితే ఏజీ కోరినట్లు 4 వారాల సమయం ఇస్తే అభ్యంతరం లేదన్నారు. తీర్పు అమలు చేయకుండా ప్రభుత్వం కమిటీలు వేసి కాలయాపన చేస్తోందన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. పదోన్నతుల కల్పన విషయంలో ఉత్తర్వులు ఇచ్చి ఏళ్లు గడిచిందని గుర్తు చేసింది. ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకుని విచారణను జనవరి 20కి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.

# సినిమా



## యంగ్ లుక్ వెనుక ఉన్న 20 ఏళ్ల సీక్రెట్ రివీల్ చేసిన మాధవన్!

ప్రముఖ నటుడు ఆర్.మాధవన్ తన యంగ్ లుక్ రహస్యం గురించి చెప్పి అందరినీ ఆశ్యర్యపరిచారు. 55 ఏళ్ల మాధవన్ ఇప్పటికీ 30%-%35 ఏళ్ల వయసు వాడిలా కనిపిస్తారు. ఆయన యంగ్ లుక్‌కి అమ్మాయిలే అబ్బాయిలు కూడా అసూయపడుతుంటారు. యంగ్ లుక్ కోసం ఏం తింటారు, ఏం చేస్తారు తెలుసుకోవాలని అందరూ ఆసక్తి చూపిస్తుంటారు. తాజాగా ఆయనకు ఎదురైన ఇదే ప్రశ్నకు ఆయన సీక్రెట్ రివీల్ చేశారు. 20 ఏళ్ల నుంచి దానినే ఫాలో అవుతున్నానంటూ మాధవన్ చెప్పిన సీక్రెట్ అందరిని ఆశ్చర్యపరిచింది.

తన యంగ్ లుక్ సీక్రెట్ ఆయుర్వేద విధానాలే అని తెలిపారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, బాటక్స్ లేదా ఫిల్లర్స్ వంటి కాస్మెటిక్ ట్రీట్‌మెంట్స్‌కు దూరంగా ఉంటూ నేచురల్ దొరికే వాటినే వాడుతానని చెప్పారు. “నా రొటీన్ చాలా సింపుల్. చిన్నప్పటి నుంచే ప్రతి ఆదివారం నూనె స్నానం చేస్తాను. సెసమీ ఆయిల్‌తో శరీరమంతా, ముఖ్యంగా తలకు రాసుకుని స్నానం చేస్తాను. మిగతా రోజుల్లో కొబ్బరి నూనె ఉపయోగిస్తాను” అని మాధవన్ తెలిపారు. ఈ ఆయుర్వేద పద్ధతిని 20 ఏళ్లకు పైగా అనుసరిస్తున్నట్లు పేర్కొన్నారు.

చర్మ సంరక్షణకు కూడా సహజ మార్గాలే తన ఎంపిక అని చెప్పారు మాధవన్. ‘ఉదయం నిద్ర లేచిన వెంటనే సూర్యకిరణాలు తనపై పడేలా గోల్ఫ్ ఆడుతానన్నారు. సన్‌టాన్ అవుతాను కానీ, చర్మం టైట్ అయి ముడతలు రాకుండా ఉంటుంది. ఫిల్లర్స్ లేదా ఎన్‌హాన్స్‌మెంట్స్ ఏం చేయించలేదు. అప్పుడప్పుడు రోల్ కోసం ఫేషియల్ చేస్తాను. కేవలం కొబ్బరి నూనె, కొబ్బరి నీళ్లు, సూర్యకాంతి, శాఖాహారమే నా చర్మాన్ని కాపాడుతున్నాయి’ అని అన్నారు.

తాను శాఖాహారినని, ఇంట్లో వండిన తాజా ఆహారాన్నే ఇష్టపడతానని మాధవన్ చెప్పారు. ప్రాసెస్డ్ ఫుడ్, ఆల్కహాల్‌కు దూరంగా ఉంటానని తెలిపారు. ఈ సహజ జీవనశైలి వల్లే 55 ఏళ్ల వయసులో కూడా యవ్వనంగా కనిపిస్తున్నానని ఆయన అభిప్రాయపడ్డారు. అభిమానులు మాధవన్ సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌ను ఎప్పుడూ పొగుడుతూనే ఉంటారు. ఏజింగ్‌ను సహజంగా ఆనందిస్తానని, దాన్ని దాచడానికి ప్రయత్నించనని ఎప్పుడూ చెప్తారు. ఈ ఆయుర్వేద రొటీన్‌తోనే ఆరోగ్యంగా, యవ్వనంగా ఉంటున్నానని స్పష్టం చేశారు.





## చలికాలంలో పెరుగు తింటున్నారా..?

శీతాకాలంలో పెరుగు తినాలా..? వద్దా అనే సందేహం చాలా మంది వ్యక్తం చేస్తుంటారు. ప్రోబయోటిక్స్ అధికంగా ఉండే పెరుగును తీసుకోవడం మీ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం. కానీ, శీతాకాలంలో విటమిన్లు అధికంగా ఉండే పెరుగును తినడానికి చాలా మంది వెనుకాడుతుంటారు. పెరుగు చల్లదనాన్ని కలిగి ఉంటుందని, ఇది జలుబు, దగ్గు సమస్యలను కలిగిస్తుందని భయపడుతుంటారు. కానీ, ఆయుర్వేదంలో సీజన్‌తో పనిలేకుండా పెరుగు ఆరోగ్యానికి మంచిది. కానీ, చలికాలంలో తప్పు సమయంలో తింటే ఇబ్బంది కలగవచ్చు. ఇది జీర్ణశక్తిని, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కానీ సరిగ్గా తీసుకోకపోతే సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. అవేంటో ఇక్కడ చూద్దాం..

పెరుగును సాధారణ ఉష్ణోగ్రత వద్ద మాత్రమే తినాలని గుర్తుంచుకోండి. ఇది కాకుండా, మీరు ఉదయం పెరుగు తినాలి. ఇది మీ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. పెరుగు మీ పేగులలో ఉండే మంచి బ్యాక్టీరియాను పెంచడంలో చాలా సహాయపడుతుంది. పెరుగులో ఉండే కాల్షియం మీ ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. పెరుగు ప్రోటీన్, కాల్షియం, రిబోఫ్లేవిన్, విటమిన్ బి6, విటమిన్ బి12 వంటి ముఖ్యమైన పోషకాలతో నిండి ఉంది. ఈ పోషకాలు రోజువారీ శరీర విధులకు సహాయపడతాయి. జీవక్రియను మెరుగుపరుస్తాయి. మొత్తం ఆరోగ్యాన్ని బలపరుస్తాయి.

పెరుగు పోషక విలువలు మెరుగైన రోగనిరోధక శక్తికి, జీర్ణ ఆరోగ్యానికి తోడ్పడతాయి. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పేగుల సమతుల్యతను కాపాడటం ద్వారా, శరీర సహజ రక్షణ వ్యవస్థకు మద్దతు ఇవ్వడం ద్వారా అనేక సాధారణ సమస్యలను తగ్గించవచ్చు. చలికాలంలో పోషకాహార నిపుణులు పెరుగును పగటిపూట తినమని చెబుతున్నారు. ఉదయం లేదా మధ్యాహ్నం సమయంలో తీసుకోవడం వల్ల శరీరం దానిని సులభంగా జీర్ణం చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. చల్లబరిచే, పోషక లక్షణాలను పూర్తిగా ఉపయోగించుకోవచ్చు.

పెరుగు సహజంగానే శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి కాబట్టి.. రాత్రిపూట పెరుగు తినడం జీర్ణక్రియకు ఆటంకం కలిగిస్తుంది. చలి సంబంధిత సమస్యలను మరింత పెంచుతుంది. ఇది శీతాకాలంలో రాత్రి సమయంలో తీసుకోవడానికి తక్కువ అనుకూలంగా ఉంటుంది. చలికాలంలో రాత్రిపూట పెరుగు తింటే కొంతమందిలో శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. చల్లదనం కారణంగా చలి, దగ్గు, గొంతు నొప్పి లేదా సైనస్ సమస్యలు వంటి లక్షణాలు తీవ్రమవుతాయి.

పెరుగులో కాల్షియం, ఫాస్పరస్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల బలాన్ని కాపాడటానికి అవసరమైన రెండు ముఖ్యమైన ఖనిజాలు. రోజూ పగటిపూట తీసుకోవడం వల్ల ఎముకల సాంద్రత, మొత్తం అస్థిపంజర ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పెరుగు తక్కువగా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. దీనిని సరిగ్గా తినడం ద్వారా గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. కాలక్రమేణా ఆరోగ్యకరమైన గుండెను నిర్వహించడానికి దోహదపడుతుంది.

పెరుగులో లాక్టిక్ ఆమ్లం ఉంటుంది. ఇది చర్మాన్ని సున్నితంగా ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది. మృత కణాలను తొలగిస్తుంది. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పొడిబారడం, మందగించటానికి పేరుగాంచిన శీతాకాలంలో స్పష్టమైన, ఆరోగ్యకరమైన చర్మం కనిపించడానికి సహాయపడుతుంది.



## ఈ ఎర్ర ముత్యాలు..

ఎర్ర ముత్యాల్లా ఎంతో ఆకర్షణీయంగా కనిపించే దానిమ్మ గింజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వాటిలోని పాలీఫెనాల్స్ రక్తపోటును నియంత్రించడంలో, హృదయ సంబంధ వ్యాధులను నివారించడంలో సహాయపడతాయి. అంతే కాదు ఇవి చర్మాన్ని %ఖం% కిరణాలు, ఆక్సీకరణ ఒత్తిడి నుంచి కూడా రక్షిస్తాయి. ఇవి చర్మం ప్రకాశవంతంగా ఉండటానికి సహాయపడతాయి. దానిమ్మ గింజలను వరుసగా 21 రోజుల పాటు ప్రతిరోజూ ఓ కప్పు చొప్పున తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని పరిశోధనలు సైతం చెబుతున్నాయి. కాబట్టి ఈ 21 రోజుల సవాలు వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటి? వీటిని ఎందుకు తినాలో ఇక్కడ తెలుసుకుందాం..

దానిమ్మ గింజలను తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇవే..

దానిమ్మ గింజలను 21 రోజుల పాటు క్రమం తప్పకుండా తినడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. మానసిక స్థితి మెరుగుపడుతుంది. ఒత్తిడి కూడా తగ్గుతుంది. ఈ పండు గింజల్లో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి హార్మోన్లను సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. అవి మెదడును ఆక్సీకరణ ఒత్తిడి నుంచి రక్షిస్తాయి. నష్టాన్ని నివారిస్తాయి. జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తాయి. మెదడు చురుకుగా పనిచేయడానికి సహాయపడతాయి. అంతే కాదు ఈ పండు విత్తనాలను నమలడం వల్ల దంతాలు, చిగుళ్ళు ఆరోగ్యంగా ఉంటాయి. ఇది దంతాలను తెల్లగా చేస్తుంది. నోటి దుర్వాసనను తొలగిస్తుంది.

## వామ్మో ఫాస్ట్ బౌలర్లకు ఇంత డిమాండా..

ఐపీఎల్ 19వ సీజన్ కోసం వేలం రేపు అంటే డిసెంబర్ 16న అబుదాబిలో జరగనుంది. ఈ వేలంలో 350 మందికి పైగా ఆటగాళ్లపై బిడ్లు వేయనున్నారు. ముఖ్యంగా ఐదుగురు ఫాస్ట్ బౌలర్లు కోట్ల రూపాయలలో అమ్ముడయ్యే అవకాశం ఉంది. ఈ జాబితాలో ఒక బౌలర్ అయితే గతంలో భారత జట్టుకు తీవ్రమైన గాయాన్ని మిగిల్చాడు. భారత్‌ను వరల్డ్ కప్ గెలవకుండా ఆపిన ఆ బౌలర్ ఎవరో, వేలంలో భారీ ధర పలికే మిగతా బౌలర్లు ఎవరో చూద్దాం. 1. మ్యాట్ హెన్రీ (న్యూజిలాండ్)

ఐపీఎల్ వేలంలో అత్యధిక ధర పలికే ఫాస్ట్ బౌలర్‌లలో న్యూజిలాండ్‌కు చెందిన మ్యాట్ హెన్రీ ముందు వరుసలో ఉండవచ్చు. ఈ కివీస్ పేసర్ తన ఖచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్, స్వింగ్‌కు ప్రసిద్ధి. ఈ సంవత్సరం మ్యాట్ హెన్రీ 29 టీ20 మ్యాచ్‌లలో 45 వికెట్లు తీశారు. అతని ఎకానమీ రేటు కేవలం 7.3 పరుగులు మాత్రమే. ఇతను 2019 వరల్డ్ కప్ సెమీఫైనల్‌లో భారత్‌ను ఓడించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ మ్యాచ్‌లో హెన్రీ 37 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు, తద్వారా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును కూడా గెలుచుకున్నాడు. 2. ముస్తిఫిజుర్ రెహమాన్ (బంగ్లాదేశ్)

బంగ్లాదేశ్ ఫాస్ట్ బౌలర్ ముస్తిఫిజుర్ రెహమాన్ పైనా ఈ ఐపీఎల్ వేలంలో బాగా డబ్బు కురిసే అవకాశం ఉంది. ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ఐపీఎల్‌లో 60 మ్యాచ్‌లు ఆడి 65 వికెట్లు తీశాడు. ఈ సంవత్సరం టీ20ల్లో ముస్తిఫిజుర్ ప్రదర్శన అద్భుతంగా ఉంది. అతను 36 మ్యాచ్‌లలో 46 వికెట్లు తీశాడు, అతని ఎకానమీ రేటు కేవలం 6.5 పరుగులు మాత్రమే.

3. జాకబ్ డఫీ (న్యూజిలాండ్)

న్యూజిలాండ్‌కు చెందిన మరో ఫాస్ట్ బౌలర్ జాకబ్ డఫీ కూడా ఐపీఎల్ వేలంలో మంచి ధర పలికే అవకాశం ఉన్న హాట్ ప్రాపర్టీ. ఈ 31 ఏళ్ల ఫాస్ట్ బౌలర్ ఈ సంవత్సరంలో 41 టీ20 మ్యాచ్‌లలో 58 వికెట్లు తీశాడు. అతని ఎకానమీ రేటు కూడా 7.9 పరుగులు మాత్రమే. ఈ ఆటగాడు గతంలో టీ20 ఇంటర్నేషనల్‌లో నెంబర్ 1 ర్యాంక్ కూడా సాధించాడు, కానీ ఇప్పటివరకు ఐపీఎల్‌లో ఆడలేదు.

4. బెన్ ద్వార్షుయస్ (ఆస్ట్రేలియా)

ఆస్ట్రేలియా లెఫ్ట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్ బెన్ ద్వార్షుయస్ కూడా ఐపీఎల్ 2026 వేలంలో మంచి ధర ఆశించవచ్చు. ఈ ఆటగాడు ఈ సంవత్సరం 43 టీ20 మ్యాచ్‌లలో 43 వికెట్లు పడగొట్టాడు. 2018 నుంచి 2021 మధ్యలో కొన్ని ఐపీఎల్ జట్లలో ఉన్నప్పటికీ, అతను డెబ్యూ చేయలేకపోయాడు. బౌలింగ్‌తో పాటు, లోయర్ ఆర్డర్‌లో పెద్ద షాట్లు కొట్టే సత్తా కూడా ఈ ప్లేయర్‌కు ఉండటం వలన, ఈసారి అతనిపై పెద్ద దావ్ పడే అవకాశం ఉంది.

5. మతీశ పతిరణ (శ్రీలంక)

చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడిన మతీశ పతిరణ కూడా ఈసారి వేలంలోకి రానున్నాడు. ఈ రైట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్‌ను డెత్ ఓవర్ల స్పెషలిస్టా భావిస్తారు. ఐపీఎల్‌లో 32 మ్యాచ్‌లలో 47 వికెట్లు తీసిన రికార్డు అతని సొంతం. అతని ఎకానమీ రేటు 8.7. మతీశ పతిరణను తిరిగి కొనుగోలు చేయడానికి చెన్నై సూపర్ కింగ్స్ తప్పకుండా ప్రయత్నిస్తుంది, అలాగే ఇతర జట్లు కూడా అతనిపై కన్నేసి ఉంచాయి.




## అదృష్టం అంటే షెఫాలీదే మధ్యలో వచ్చి కప్ కొట్టేసింది.

గత రెండు నెలల్లో యువ క్రికెటర్ షెఫాలీ వర్మ జీవితంలో జరిగింది నిజంగా ఓ మిరాకిల్ అని చెప్పవచ్చు. మొదట్లో అవకాశం దక్కకపోయినా, అదృష్టం రూపంలో ఆమెకు ఆ ఛాన్స్ లభించింది. ఆ అవకాశాన్ని షెఫాలీ అద్భుతంగా సద్వినియోగం చేసుకున్నారు. దాని ఫలితమే ఇప్పుడు ఐసీసీ కూడా ఆమె ప్రతిభను గుర్తించింది. వరల్డ్ కప్ ఫైనల్‌లో అద్భుత ప్రదర్శన చేసిన షెఫాలీ వర్మ, నవంబర్ నెలకు గాను ఐసీసీ మహిళా ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు ఎంపికయ్యారు.

మహిళల వన్డే వరల్డ్ కప్ కోసం మొదట్లో ప్రకటించిన భారత జట్టులో షెఫాలీ వర్మకు స్థానం దక్కలేదు. కానీ సెమీఫైనల్‌కు కొద్ది రోజుల ముందు భారత ఓపెనర్ ప్రతికా రావల్ గాయపడటంతో, షెఫాలీకి జట్టులోకి వచ్చే అవకాశం దొరికింది. వరల్డ్ కప్ మధ్యలో టీమిండియాలో చేరిన షెఫాలీ, సెమీఫైనల్‌లో రాణించలేకపోయింది. కానీ ఫైనల్ మ్యాచ్‌లో ఆమె 78 బంతుల్లో 87 పరుగుల ధనాధన్ ఇన్నింగ్స్ ఆడింది. టీమిండియా వరల్డ్ కప్‌ను గెలవడంలో ఈ ఇన్నింగ్స్ కీలక పాత్ర పోషించింది.

వరల్డ్ కప్ ఫైనల్‌లో షెఫాలీ వర్మ కేవలం బ్యాటింగ్‌తోనే కాదు, బౌలింగ్‌తో కూడా అదరగొట్టింది. 87 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడే క్రమంలో ఆమె, సీనియర్ ఓపెనర్ స్మృతి మంధానతో కలిసి తొలి వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. బ్యాటింగ్‌కే పరిమితం కాకుండా, షెఫాలీ బౌలింగ్‌లో కూడా తన సత్తా చాటింది. ఫైనల్‌లో ఆమె 7 ఓవర్లు వేసి కేవలం 36 పరుగులు ఇచ్చి రెండు ముఖ్యమైన వికెట్లు పడగొట్టింది. ఈ వికెట్లలో ఒకటి స్టార్ ప్లేయర్ మారిజెన్ కేప్ ది కూడా ఉంది.

ఫైనల్ మ్యాచ్‌లో తన అద్భుత ప్రదర్శనపై షెఫాలీ వర్మ స్పందించింది. “ఇది నాకు మొదటి వరల్డ్ కప్. నేను అనుకున్నట్లే ఇది చాలా బాగా జరిగింది. నేను ఎలా ఊహించుకున్నానో, అంతా అలాగే జరిగింది. టీమ్ ఫైనల్ గెలవడానికి నా వంతు సహాయం చేయడం చాలా సంతోషంగా ఉంది. స్వదేశంలో మన అభిమానుల సమక్షంలో జట్టు తొలిసారిగా వరల్డ్ కప్ గెలవడాన్ని కళ్లారా చూసే అవకాశం నాకు దక్కింది” అని ఆమె సంతోషం వ్యక్తం చేసింది.



Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..